జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

కృష్ణ  శుక్రవారం 8 మే 2026  సంపుటి : 01  సంచిక :104  పేజీలు : 12  వెల : 3/-  PRGI No. APTEL/26/A0119,

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI  http://www.prajajyothinews.com  Mail: prajajyothidaily@gmail.com



## హార్ముజ్‌పై అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం

- త్వరలోనే తెరుచుకోనున్న జలసంధి
- ఒకట్రెండు రోజుల్లోనే హార్ముజ్ విషయంలో పూర్తి ఒప్పందం కుదిరి, జలసంధి అందుబాటులోకి వచ్చే అవకాశం



## హార్ముజ్ జలసంధి దాటిన 11భారత నౌకలు

- ఇంకా 13 నౌకలు అక్కడే..
- విదేశాంగ శాఖ ప్రకటన
- మిగిలిన నౌకల్ని కూడా ఇండియా రప్పించేందుకు ఇరాన్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడి

# రవాణా వ్యయం భారీగా తగ్గాలి



- పారిశ్రామిక పార్కులకు రోడ్, రైల్ కనెక్టివిటీ పెరగాలి
- స్వర్ణాంధ్ర విజన్ 10 సూత్రాలపై సీఎం చంద్రబాబు సమీక్ష
- వివిధ అంశాలపై కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం
- లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గించాలి, అప్పుడే ఎక్కువ అభివృద్ధి సాధించగలమన్న సీఎం

**అమరావతి**

స్వర్ణాంధ్ర-2047 విజన్ 10 సూత్రాలపై కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు. లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గించగలిగితే అప్పుడు మరింతగా అభివృద్ధి సాధించగలమని అభిప్రాయపడ్డారు. రైలు మార్గం ద్వారా ప్రతీ కిలోమీటరుకు రూ.1.83 వ్యయం అవుతుంటే రహదారి మార్గంలో జరిగే రవాణా పై రూ.3.40 ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. రవాణా వ్యయం గణనీయంగా తగ్గితేనే ఏపీకి గరిష్టంగా ప్రయోజనం కలుగుతుందని వెల్లడించారు.పారిశ్రామిక పార్కులకు - మిగతా3లో



## రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అకాల వర్షం

- మరో 2 రోజులపాటు పిడుగులతో కూడిన వానలు!
- పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్న రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ
- రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచన



## ఏ ఉగ్రస్థావరం సురక్షితం కాదు

- ఆపరేషన్ సిందూర్ ముగింపు కాదు ప్రారంభం
- ఆపరేషన్ సిందూర్‌తో ఆ సందేశమిచ్చామన్న సైన్యం
- ప్రజలు, భద్రత, సార్వభౌమత్వాన్ని భారత్ కాపాడుకోగలదని వ్యాఖ్య
- ఆపరేషన్ సిందూర్‌కు నేటితో ఏడాది పూర్తి అయిన వేళ త్రివిధ దళాల అధిపతుల సమావేశం

## త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు

### కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు

**(అంకుశం, అమరావతి, మే 7):**



త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రెండు రోజుల కలెక్టర్ల సమీక్షలో భాగంగా మొదటి రోజైన గురువారం సీఎం మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో రూ.64 వేల కోట్ల విలువైన 624 రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయన్నారు. వీటితో పాటు రూ.2 లక్షల కోట్ల ప్రాజెక్టులు డీపీఆర్ దశలో ఉన్నాయన్నారు. ఎక్స్‌ప్రెస్, లోకల్ ట్రైన్స్ లాంటి ప్రాజెక్టులు వస్తాయని, నాలుగు లేన్లతో రైల్వే మార్గాల విస్తరణ జరగబోతోందని వెల్లడించారు

# పిఠాపురంలో జనసేనదే పైచేయి

### ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా వర్మ తొలగింపు



**అమరావతి**

పిఠాపురం నియోజకవర్గంలో జనసేన, తెలుగుదేశం పార్టీ నాయకుల మధ్య తరచూ గొడవలు జరుగుతూనే ఉన్నాయి. పిఠాపురం నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా పవన్ కళ్యాణ్ ప్రాతినిథ్యం వహిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల ఆ నియోజకవర్గంలో నిర్వహించిన ప్రభుత్వ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ఫొటో లేకపోవడంతో పిఠాపురం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ఎన్ వర్మ ప్రశ్నించారు. దీంతో జనసేన, టీడీపీ వర్గీయుల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. జనసే, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసిమెలిసిగా ఉండాలని సీఎం పదేపదే చెబుతున్నా కొన్ని చోట్ల అందుకు భిన్నంగా - మిగతా3లో

## కేరళ సీఎం సీటుకు హోరాహోరీ పోరు

- ఎమ్మెల్యేలతో ఏఐసీసీ పరిశీలకులు.. వన్ టూ వన్ మీటింగ్
- కేరళ సీఎం ఎంపికకు ఏఐసీసీ కసరత్తు
- ఎమ్మెల్యేల అభిప్రాయాలు సేకరించిన పరిశీలకులు
- రేసులో వి.డి.సతీశన్, కేసీ వేణుగోపాల్, రమేశ్ చెన్నితాల
- ఈ నేతల మద్దతుదారుల మధ్య పోస్టర్ వార్
- మే 10కల్లా సీఎం ఎంపికపై ప్రకటన?





## రిసార్ట్‌కు 28మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు

- హాట్ హాట్‌గా తమిళ పాలిటిక్స్
- రిసార్ట్‌లో సుమారు 28 మంది ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలు ఉన్నట్లు సమాచారం
- అన్నాడీఎంకే పార్టీ నాయకత్వంలో విభేదాలు తలెత్తినట్లు వార్తలు

# సింగపూర్ తరహా అభివృద్ధికి ప్రణాళికలు

- 'నేను కాదు మనం'
- సింగపూర్ అత్యుత్తమ విధానాలతో మోడల్ జిల్లా
- ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న బలమైన వ్యవస్థలైన ఆర్టీజీఎస్, మీ భూమి, సింగిల్ డెస్క్ వంటి వాటిని సింగపూర్ మాదిరి ఒకదానితో ఒకటి అనుసంధానించాలన్న మంత్రులు




**అమరావతి**

సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో కలెక్టర్ల సదస్సు నిర్వహించారు. ఈ క్రమంలో సింగపూర్ వెళ్లొచ్చిన మంత్రులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. సింగపూర్ తరహాలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు పలు సలహాలు ఇచ్చారు. ఆర్థికపరమైన సవాళ్లను అధిగమిస్తూ ఏపీ ముందుకు వెళ్తోందని కలెక్టర్ల కాన్ఫరెన్సులో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వివరించారు. ప్రజలకు ఏం మేలు జరుగుతుందోననే అంశాన్ని ఆలోచించి ప్రతి పైసా ఖర్చు చేస్తున్నామన్నారు. ప్రజలకు మెరుగైన జీవితం కల్పించేలా ప్రాధాన్యతలను మార్చుకుంటూ వెళ్తున్నామన్నారు. వ్యవస్థలో లోపాలను సవరించుకుంటూ ఆదాయాలను పెంచుకోవాలని తెలిపారు. రాష్ట్రంలోని డిజిటల్ ఇన్‌ఫ్రాను సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. వృధా ఖర్చులను తగ్గించుకుని అభివృద్ధి కోసం వ్యయాలను పెంచాల్సి ఉందని తెలిపారు. - మిగతా3లో



## విజయ్ ప్రమాణస్వీకారంపై క్లారిటీ ఇచ్చిన లోక్ భవన్

- గవర్నర్ నివాసం ఎదుట 'టీవీకే' ఆందోళన
- తమిళనాడులో క్షణక్షణం మారుతున్న రాజకీయ పరిస్థితులు
- గవర్నర్ ఆర్లేకర్‌తో విజయ్ భేటీపై ప్రకటన విడుదల చేసిన లోక్‌భవన్

# కేరళ సీఎం సీటుకు హోరాహోరీ పోరు



కేరళ నూతన ముఖ్యమంత్రి రేసు రసవత్తరంగా మారింది. ఈ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయాన్ని సాధించిన కాంగ్రెస్ పార్టీ, నూతన సీఎం ఎంపికకు ముమ్మర కసరత్తు చేస్తోంది. దీంతో ముఖ్యమంత్రిగా ఎవరు ఎంపికవుతారు అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. గురువారం రాష్ట్ర కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశాన్ని పర్యవేక్షించడానికి అఖిలభారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) నియమించిన పరిశీలకులు ముకుల్ వాస్నిక్, అజయ్ మాకెన్ తిరువనంతపురంకు చేరుకున్నారు. నగరంలోని కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో జరిగిన సీఎల్పీ సమావేశంలో వారు పాల్గొన్నారు. కేరళ సీఎం ఎంపికపై తుది నిర్ణయాన్ని తీసుకునే అధికారాన్ని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఇస్తూ ఏక వాక్య తీర్మానాన్ని ఆమోదించడంతో ఈ సమావేశాన్ని ప్రారంభించారు. వెంటనే ఏఐసీసీ పరిశీలకులు ప్రతీ ఎమ్మెల్యేతో సుదీర్ఘంగా ముఖాముఖిగా మాట్లాడారు. సీఎం ఎవరైతే బాగుంటుంది అనే దానిపై అందరు ఎమ్మెల్యేల రహస్య ప్రాధాన్యతలను నమోదు చేశారు. ఈ ప్రక్రియ ద్వారా సేకరించిన సమాచారంలోని ఎమ్మెల్యేల మెజారిటీ అభిప్రాయానికే కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రాధాన్యం ఇస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ విధంగా కేరళ సీఎం ఎంపిక ప్రక్రియతో ఓ వైపు తిరువనంతపురం, మరోవైపు దిల్లీలోని కాంగ్రెస్ వర్గాల్లో రాజకీయ వేడి రాచుకుంది.

**కేసీ వేణుగోపాల్‌కు ఛాన్స్ దక్కేనా?**

పదేళ్ల విరామం తర్వాత కాంగ్రెస్ సారథ్యంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) కూటమి కేరళలో గెలిచింది. 102 సీట్ల భారీ మెజారిటీని సాధించింది. ఇప్పుడు సీఎం సీటు కోసం జరుగుతున్న పోటీలో ప్రధానంగా ముగ్గురు అగ్రనేతల పేర్లు వినిపిస్తున్నాయి. వారే వి.డి.సతీశన్, కేసీ వేణుగోపాల్, రమేశ్ చెన్నితాల. కేసీ వేణుగోపాల్ ప్రస్తుతం కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత వ్యవహారాలు) హోదాలో ఉన్నారు. పార్టీ హైకమాండ్‌లోని ముఖ్య నేతలతో ఆయనకు మంచి పరిచయాలు ఉన్నాయి. ప్రత్యేకించి అగ్రనేత రాహుల్ గాంధీతో సాన్నిహిత్యం ఉంది. దీనికి తోడు మాజీ కేరళ పీసీసీ అధ్యక్షుడు కె.సుధాకరన్ బహిరంగ మద్దతును ప్రకటించడంతో, రాష్ట్ర సీఎం రేసులో కేసీ వేణుగోపాల్ కూడా ఉన్నారనే టాక్ మొదలైంది. మాజీ సీఎంలు కే కరుణాకరన్, ఒమెన్ చాందీల బాటలోనే కాంగ్రెస్‌ను వ్యవస్థాగతంగా కేసీ వేణుగోపాల్ బలోపేతం చేస్తున్నారని ఇటీవలె కె.సుధాకరన్ వ్యాఖ్యానించారు. కేసీ వేణుగోపాల్ 2024 సాధారణ ఎన్నికల్లో కేరళలోని ఆలప్పుళ లోక్‌సభ స్థానం నుంచి గెలిచారు. లోక్‌సభకు ఎన్నికవ్వడానికి ముందు ఆయన రాజస్థాన్ నుంచి రాజ్యసభ సభ్యునిగా ఉండేవారు.

**ప్రతిపక్ష నేతగా రాణించిన వి.డి. సతీశన్**

2021 నుంచి కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించిన వి.డి. సతీశన్ కూడా సీఎం రేసులో ఉన్నారు. ఈయన గత ఐదేళ్లుగా ప్రతిపక్ష నేత హోదాలో అధికార పక్ష వైఫల్యాలను ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పరవూర్ అసెంబ్లీ స్థానం నుంచి వరుసగా ఆరోసారి ఘనవిజయం సాధించారు. కేరళ సీఎం పదవికి ఈయనే ప్రధాన పోటీదారు అని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఈ ఎన్నికల్లో కేరళ ప్రజలు ఇచ్చిన తీర్పు వి.డి. సతీశన్ నాయకత్వానికి ప్రత్యక్ష ఆమోదం లాంటిదని ఆయన మద్దతుదారులు, ముస్లిం లీగ్ వంటి ప్రధాన మిత్రపక్షాలు వాదిస్తున్నాయి. తనకు సీఎం పదవిని కేటాయించకుంటే, ఇతరత్రా మంత్రి పదవులను అంగీకరించ కూడదు అనే గట్టి వైఖరిని వి.డి.సతీశన్ తీసుకున్నట్లు తెలుస్తోంది.

**పాలనా, సంస్థాగత అనుభవం కలిగిన రమేశ్ చెన్నితాల**

సీఎం రేసులో బలమైన పోటీదారుగా నిలుస్తున్న మరో సీనియర్ నేత పేరు రమేశ్ చెన్నితాల. ఆయన గతంలో కేరళ రాష్ట్ర హోం మంత్రిగా, అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా (2016–2021), కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) అధ్యక్షుడిగా పనిచేశారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)లో రమేశ్ చెన్నితాల శాశ్వత ఆహ్వానితుడిగా జాతీయ స్థాయిలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మహారాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలకు పరిశీలకుడిగా, ఇన్‌చార్జ్‌గా కూడా బాధ్యతలు చూస్తున్నారు. 2026 కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన హరిపాడ్ అసెంబ్లీ స్థానం నుంచి వరుసగా ఆరోసారి ఘనవిజయం సాధించారు.ఆయనకు దశాబ్దాల పరిపాలనా, సంస్థాగత అనుభవం ఉంది.

**మద్దతుదారుల మధ్య పోస్టర్ వార్**

కేరళ నూతన సీఎం ఎవరనే దానిపై వి.డి.సతీశన్, రమేశ్ చెన్నితాల, కేసీ వేణుగోపాల్ మద్దతుదారుల మధ్య పోస్టర్ వార్ నడుస్తోంది. కేసీ వేణుగోపాల్ ప్రస్తుతం ఆలప్పుళ లోక్‌సభ సభ్యునిగా ఉన్నారు. ఆయన సొంత జిల్లా కూడా ఆలప్పుళే. ఒకవేళ వేణుగోపాల్‌ను కేరళ ముఖ్యమంత్రిగా ఎంపిక చేస్తే, ఆయన తన ఎంపీ పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. దీనివల్ల ఆలప్పుళలో మళ్లీ ఉప ఎన్నిక వస్తుంది. ఈనేపథ్యంలో ఆలప్పుళపై ఉప ఎన్నికను రుద్దే ప్రయత్నాన్ని మానుకోండి అనే సందేశంతో, కాంగ్రెస్ సహయాత్రికులు పేరుతో ఆలప్పుళ జిల్లాలో బ్యానర్లు వెలిశాయి. వేణుగోపాల్‌కు వ్యతిరేకంగా ఆలప్పుళ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం ఎదుట వెలిసిన పోస్టర్లను ఒక వర్గం కార్యకర్తలు చించివేశారు. కొట్టాయం వంటి ప్రాంతాల్లో వేణుగోపాల్‌ను విజయ శిల్పి అని పొగిడే పోస్టర్లపై గుర్తుతెలియని వ్యక్తులు నల్ల రంగు పూశారు. మరోవైపు, ఇందిరా భవన్ బయట వేణుగోపాల్‌కు మద్దతుగా ఫ్లెక్సీ బోర్డులు కనిపించాయి. ఈవిధమైన అంతర్గత కలహాలు, ప్రజల్లో వ్యక్తమవుతున్న భావోద్వేగాల వల్ల కేరళ సీఎం ఎంపిక ప్రక్రియ మరింత సంక్లిష్టంగా మారుతోంది.

**ఏఐసీసీ పరిశీలకుల నివేదికే కీలకం**

రాష్ట్రంలో ఏర్పడే కొత్త ప్రభుత్వం అందరినీ కలుపుకొని ముందుకు సాగేలా చూసేందుకు ఏకే ఆంటోనీ వంటి సీనియర్ నాయకులతో, ముస్లిం లీగ్ వంటి కీలక సంకీర్ణ భాగస్వాములతోనూ ఏఐసీసీ పరిశీలకులు సమావేశం కానున్నారు. ఈ పర్యటనలో తాము గుర్తించిన, నమోదు చేసిన వివరాలను, ఎమ్మెల్యేల అభిప్రాయాలను వారు కాంగ్రెస్ హైకమాండ్‌కు సమర్పించనున్నారు. గురువారం రాత్రే ఏఐసీసీ పరిశీలకులు దిల్లీకి తిరిగి వెళ్లనున్నారు. బహుశా ఆదివారం(మే 10) నాటికి సీఎం ఎంపికపై కాంగ్రెస్ హైకమాండ్ తుది ప్రకటనను విడుదల చేయొచ్చని పార్టీ సీనియర్ నాయకుడు కె. మురళీధరన్ తెలిపారు. సంస్థాగత సీనియారిటీతో పాటు స్థానిక నాయకత్వ యోగ్యతలను కలిగిన కాంగ్రెస్ నేతను సీఎంగా ఎంపిక చేసే వరకు దీనిపై ఉత్కంఠ కొనసాగనుంది.

# విజయ్ ప్రమాణస్వీకారంపై క్లారిటీ ఇచ్చిన లోక్ భవన్



తమిళనాడులో రాజీకీయాలు ఉత్కంఠభరితంగా మారాయి. ప్రభుత్వ ఏర్పాటు గవర్నర్ అంగీకారం తెలుపలేదని అంతకుముందు వార్తా కథనాలు వెలువడ్డాయి. 118 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని నిరూపించాలని గవర్నర్ విజయ్‌కు సూచించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. అయితే, ఆ వార్తలపై లోక్‌భవన్ తాజాగా ప్రెస్‌నోట్ విడుదల చేసింది. అందులో, ప్రభుత్వం ఏర్పాటుకు మెజారిటీ చూపాల్సిన అవసరాన్ని విజయ్‌కు గవర్నర్ వివరించారని పేర్కొంది. "ఇవాళ గవర్నర్ ఆర్లేకర్‌తో విజయ్ భేటీ అయ్యారు. మెజార్టీ కనిపించడం లేదని వివరించారు. మెజార్టీతోనే రావాలని గవర్నర్ సూచించారు" అని లోక్‌భవన్ అధికారిక ప్రకటనలో వెలువడింది.

అయితే, గవర్నర్ ఆహ్వానం మేరకే విజయ్ ఆయన్ను కలిసినట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలు అనంతరం రెండు రోజుల వ్యవధిలో వీరి భేటీ జరిగడం ఇది రెండో సారి. ఇప్పటికే టీవీకేకు కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన నేపథ్యంలో బుధవారం గవర్నర్‌తో టీవీకే చీఫ్ భేటీ అయ్యారు.

**లోక్‌భవన్ వెలుపల టీవీకే నిరసన**

మరోవైపు, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి విజయ్?ను అనుమతించాలని డిమాండ్ చేస్తూ, ౹ఎఖ కార్యకర్తలు లోక్ భవన్ వెలుపల ఆందోళన చేపట్టారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. మెజారిటీని నిరూపించుకోవడానికి లోక్?భవన్? సరైన వేదిక కాదని, శాసనసభ మాత్రమే సరైన స్థలమని టీవీకే కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో 108 మంది ఎమ్మెల్యేలను గెలుచుకొని తమ పార్టీ అతిపెద్ద పార్టీగా అవతరించిందని వారు గుర్తు చేశారు. టీవీకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే విషయంలో, గవర్నర్? బీజేపీకి పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గవర్నర్?కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. గురువారం విజయ్? ప్రమాణ స్వీకారం చేయలేకపోయినందున తాము నిరాశ చెందామని, అయితే, విజయ్? ప్రభుత్వం ఏర్పాటు అయ్యేవరకు చెన్నైలోనే ఉండిపోవాలని నిర్ణయించుకున్నట్లు టీవీకే కార్యకర్తలు తెలిపారు.

**టీవీకేకు మద్దతు అంశంపై వామపక్ష పార్టీల్లో చర్చ**

ఇదిలా ఉండగా, టీవీకేకు మద్దతు అంశంపై వామపక్ష పార్టీల్లో చర్చ మొదలైంది. ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇవ్వాలని విజయ్ తమ పార్టీకి లేఖ రాశారని సీపీఐ నాయకుడు వీరపాండియన్ తెలిపారు. దీనిపై చర్చించేందుకు శుక్రవారం అత్యవసర రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశం అనంతరం తుది నిర్ణయం ప్రకటిస్తామని వెల్లడించారు. అలాగే డీఎంకే నేత ఎంకే స్టాలిన్‌తో జరిగిన సమావేశం కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమేనని వీరపాండియన్ స్పష్టం చేశారు.

**రాష్ట్రంలో బీజేపీ గందరగోళం సృష్టిస్తోంది!**

మరోవైపు విడుతలై చిరుతైగల్ కచ్చి (వీకేసీ) అధినేత తోల్ తిరుమావళవన్ కూడా గవర్నర్‌ను కలిసి టీవీకేకు ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. అదేసమయంలో బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. తమిళనాడు రాజకీయాల్లో బీజేపీ జోక్యం చేసుకుంటూ గందరగోళం సృష్టిస్తోందని ఆరోపించారు. "టీవీకే రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాబట్టి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వాలి. అదే రాజ్యాంగం సూచించే విధానం. విజయ్ మద్దతు కోరుతూ ప్రయత్నాలు చేస్తున్నా గవర్నర్ నిర్ణయం తీసుకోకుండా అనిశ్చితికి తావిస్తున్నారు. ఇది ఆమోదయోగ్యం కాదు" అని వీసీకే అధినేత తిరుమావళవన్ వ్యాఖ్యానించారు. టీవీకేకు మద్దతు అంశంపై తమ పార్టీ త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందన్నారు. విజయ్ నుంచి మద్దతు కోరుతూ లేఖ అందిందని తెలిపారు. మరోవైపు, అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే 108 స్థానాలు గెలుచుకుంది. అయితే, విజయ్ రెండు స్థానాల్లో విజయం సాధించిన నేపథ్యంలో ఒక స్థానానికి రాజీనామా చేయాల్సి రావడంతో పార్టీ బలం 107కు తగ్గనుంది. కాంగ్రెస్‌కు ఉన్న ఐదు స్థానాలు కలిపినా కూటమి బలం 112కే పరిమితం అవుతోంది. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కావాల్సిన మెజారిటీకి ఇంకా ఐదు స్థానాలు తక్కువగా ఉన్నాయి.

# ఏ ఉగ్రస్థావరం సురక్షితం కాదు



పాకిస్థాన్‌లోని ఏ ఉగ్రవాద స్థావరం సురక్షితం కాదని 'ఆపరేషన్ సిందూర్' నిరూపించిందని, ఇది ముగింపు కాదని కేవలం ఆరంభం మాత్రమేనని భారత సైన్యం వెల్లడించింది. సరిహద్దు ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్న పాకిస్థాన్‌ను శిక్షించడానికి, గత అర్ధ శతాబ్దంలో భారతదేశం చేపట్టిన అత్యంత విస్తృతమైన పోరాట మిషన్‌గా అభివర్ణించింది. ఆపరేషన్ సిందూర్ నిర్వహించి ఏడాది పూర్తైన నేపథ్యంలో అందుకు సంబంధించిన వివిధ అంశాలను వివరిస్తూ త్రివిధ దళాల అధిపతులు జైపుర్‌లో సంయుక్త పత్రికా సమావేశం నిర్వహించారు.

**ఆపరేషన్ సిందూర్ ముగింపు కాదు ప్రారంభమని వెల్లడి**

ఆపరేషన్ సిందూర్ ప్రపంచవ్యాప్తంగా సైనిక వ్యూహాలకు కొత్త పాఠంగా నిలిచిందని డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు నేటితో ఏడాది పూర్తి అయిన వేళ మాట్లాడిన జనరల్ రాజీవ్, సమాచార, నిఘా, దీూఖీ, సైన్యం వంటి అన్ని విభాగాల మధ్య అద్భుతమైన సమన్వయం విజయానికి కారమణన్నారు. ఈ ఆపరేషన్‌లో బ్రహ్మోస్, ఆకాశ్‌తో సహా మరెన్నో స్వదేశీ ఆయుధాలు నిర్ణయాత్మక పాత్ర పోషించాయన్నారు. అత్యంత తక్కువ సమయంలో ఒక సంక్లిష్టమైన ఆపరేషన్‌కు ప్రణాళిక చేసి అమలు చేశామన్నారు. ఏ ఉగ్ర స్థావరం సురక్షితం కాదని ఆపరేషన్ సిందూర్‌తో స్పష్టమైన సందేశం ఇచ్చామని చెప్పారు. ప్రజలు, భద్రత, సార్వభౌమత్వాన్ని భారత్ కాపాడు కోగలదని వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ ముగింపు కాదని, ప్రారంభమని జనరల్ రాజీవ్ ఉద్ఘాటించారు. "ఆపరేషన్ సిందూర్ జరిగి సరిగ్గా నేటికి ఏడాది పూర్తైంది. అప్పటి డీజీఎంవోగా దీనిని కేవలం ఒక సైనిక చర్యగా మాత్రమే కాకుండా, భారత్ వ్యూహాత్మక ప్రయాణంలో ఒక కీలక ఘట్టంగా భావిస్తున్నాను. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ తన పాత పద్ధతులు, విధానాలను పక్కన పెట్టి ఖచ్చితత్వం, సమతుల్యత, స్పష్టమైన లక్ష్యంతో నియంత్రణ రేఖ వెంబడి, పాకిస్థాన్‌తో ఉన్న అంతర్జాతీయ సరిహద్దుల్లో ఉగ్రవాదాన్ని లక్ష్యంగా చేసుకుంది. ఇది ఒక దేశం ప్రదర్శించిన సంకల్పం, బాధ్యత, వ్యూహాత్మక సంయమనానికి నిదర్శనం."

**'13 పాకిస్థానీ విమానాలను ధ్వంసం చేశాం'**

ఆపరేషన్ సిందూర్ వాయుశక్తి ప్రాధాన్యాన్ని పునరుద్ఘాటించిందని అప్పటి వైమానిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్, ఎయిర్ మార్షల్ ఎ.కె. భారతి అన్నారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత బలగాలు 13 పాకిస్థానీ విమానాలను ధ్వంసం చేశాయని వెల్లడించారు. 11 ఎయిర్‌ఫీల్డ్‌లపై దాడి చేశామని, దీనికి సంబంధించిన రుజువులు అందరికీ అందుబాటులో ఉన్నాయని గుర్తు చేశారు. "మే 7న పాకిస్థాన్?లోని 9 ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసి వాటిని ధ్వంసం చేశాము. దానికి సంబంధించిన రుజువులు అందరూ చూసేందుకు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 11 ఎయిర్‌ఫీల్డ్‌లపై దాడి చేశాం. నేలపైన లేదా గాలిలో ఉన్న వారి 13 విమానాలను ధ్వంసం చేశాం. అందులో 300 కిలోమీటర్లకు పైగా రికార్డు దూరంలో ఒక అత్యంత విలువైన వైమానిక ఆస్తిని కూడా కూల్చాం." అని ఆయన అన్నారు. భారత సైనిక లేదా పౌర మౌలిక సదుపాయాలకు ఎలాంటి గణనీయమైన నష్టాన్ని కలిగిం చడంలో పాకిస్థాన్ విఫలమైందని స్పష్టం చేశారు. పాకిస్థాన్ పదేపదే చేస్తున్న అబద్ధపు ప్రచారాలను తోసిపుచ్చారు.

**పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్**

జమ్ము కశ్మీర్?లోని పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురువారంతో ఏడాది పూర్తి చేసుకుంది. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోగా, మే 7 అర్ధరాత్రి భారత్ ఈ భారీ సైనిక చర్య చేపట్టింది.

## రిసార్ట్‌కు 28మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు

తమిళనాడులో నూతన ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధత నెలకొనడంతో అన్నాడీఎంకే తమ ఎమ్మెల్యేలను పుదుచ్చేరిలోని రిసార్టుకు తరలించింది. సుమారు 28 మంది ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలకు వసతి కల్పించినట్లు తెలుస్తోంది. ఈ ఎమ్మెల్యేలు అన్నాడీఎంకే సీనియర్ నాయకుడు సి.వి. షణ్ముగం మద్దతుదారులని వార్తలు వస్తుండటంతో రాజకీయ వర్గాల్లో అనేక ఊహాగానాలకు దారితీసింది. కాగా, అన్నాడీఎంకే తరఫున ఎన్నికైన 47 మంది ఎమ్మెల్యేల్లో కొంత మంది విజయ్ నేతృత్వంలోని టీవీకేకు మద్దతిచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తమిళనాడు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.

**పవర్ షేరింగ్‌పై కూడా చర్చలు!**

ప్రభుత్వ ఏర్పాటు కోసం టీవీకేకు మద్దతు ఇచ్చే విషయంపై ఏఐఏడీఎంకే నాయకులతో తమిళనాడు మాజీ మంత్రి, టీవీకే నేత కేఏ సెంగొట్టయ్యన్‌తో సహా పార్టీ సీనియర్ నేతలు చర్చలు జరుపుతున్నారని తెలుస్తోంది. పవర్ షేరింగ్?పై కూడా చర్చలు జరుగుతున్నాయని సమాచారం. దీని ప్రకారం సీవీ షణ్ముగంకు కీలక మంత్రి పదవులతో పాటు ఉప ముఖ్యమంత్రి పదవిని కూడా ఆఫర్ చేసే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలోనే 28 మంది ఎమ్మెల్యేలను పుదుచ్చేరిలోని ప్రైవేట్ రిసార్ట్‌కు తరలించడంతో రాజకీయ ఊహాగానాలు మరింత బలాన్ని చేకూర్చాయి. కాగా, ఈ రిసార్ట్?ను అన్నాడీఎంకే చీఫ్ పళనిస్వామి సన్నిహితుడు సీవీ షణ్ముగం బుక్ చేసినట్లు తెలుస్తోంది. రానున్న రోజుల్లో మరిన్ని గదులు బుక్ చేయనున్నట్లు సమాచారం.

**పార్టీ నాయకత్వంలో విభేదాలు**

మరోవైపు విజయ్ నేతృత్వంలోని టీవీకేకు మద్దతు ఇచ్చే ప్రతిపాదనకు ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కే పళనిస్వామి అంగీకరించకపోవడంతో పార్టీ నాయకత్వంలోని కొన్ని వర్గాల్లో విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. కొత్త ప్రభుత్వంలో కీలక పదవులు తీసుకుని టీవీకేకు మద్దతు ఇవ్వడానికి సీవీ షణ్ముగం, ఓఎస్ మణియన్‌తో సహా పలువురు నాయకులు సుముఖంగా ఉన్నారని సమాచారం. అయితే, ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియకు సంబంధించి సుప్రీం కోర్టు లేదా హైకోర్టును ఆశ్రయించడం ద్వారా చట్టపరమైన మార్గాలను అన్వేషించాలని టీవీకే భావిస్తోంది. తిరిగి ఎన్నికలకు వెళ్లే అవకాశాన్ని కూడా కొందరు నాయకులు సూచించారని వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా, గురువారం చెన్నైలోని లోక్?భవన్?లో తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను టీవీకే అధినేత విజయ్ మరోసారి కలిశారు. మెజారిటీని చూపించి, మద్దతు ఇస్తున్న ఎమ్మెల్యేల జాబితాను సమర్పించాలని విజయ్‌ను గవర్నర్? కోరారని లోక్?భవన్ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్?పై స్పష్టత ఇవ్వాలని గవర్నర్ కోరినట్లు పేర్కొన్నాయి. అంతకుముందు పార్టీలో ఎలాంటి విభేదాలు, చీలికలు లేవని ఏఐఏడీఎంకే అధికార ప్రతినిధి సత్యన్? స్పష్టం చేశారు. అలాగే, ఏఐఏడీఎంకే, టీవీకే వర్గాల మధ్య చర్చలు జరిగాయని చెప్పారు. అయితే, హైకమాండ్? నిర్ణయం కోసం వేచి ఉండాలని చెప్పారు. ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు కోసం టీవీకే పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్. ఆనంద్ బుధవారం ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె. పళనిస్వామితో సమావేశమయ్యారు. ఆయనతో పాటు ఇతర సీనియర్ టీవీకే నాయకులు కూడా ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శిని కలిశారు. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాల్లో టీవీకే పార్టీ 108 సీట్లను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా నిలిచింది. డీఎంకే 59, అన్నాడీఎంకే 47 స్థానాలు గెలుచుకున్నాయి. అయితే విజయ్ ప్రభుత్వ ఏర్పాటుకు మరో 10 స్థానాలు కావాల్సి ఉంది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ ఇప్పటికే ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల మద్దతును పొందారు. కానీ తమిళనాడు అసెంబ్లీలో మెజారిటీ మార్కును చేరుకోవడానికి ఇంకా ఆరుగురు శాసనసభ్యుల మద్దతు అవసరం ఉంది.

## హార్ముజ్‌పై అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం



ప్రపంచ దేశాలకు ఇదో గుడ్ న్యూస్. కొద్ది రోజులుగా మూసి ఉన్న హార్ముజ్ జలసంధి త్వరలోనే తెరుచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ జలసంధి విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య ఒప్పందం తుది దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ సంస్థల అంచనా ప్రకారం.. హార్ముజ్ జలసంధి విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ అంశంపై గురువారం రెండు దేశాలు ఒక ఒప్పందానికి వచ్చినట్లు తెలుస్తోంది. హార్ముజ్‌ను వీలైనంత త్వరగా, దశలవారీగా అందుబాటులోకి తేవాలని ఇరు దేశాలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఒకట్రెండు రోజుల్లోనే హార్ముజ్ విషయంలో పూర్తి ఒప్పందం కుదిరి, జలసంధి అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. అలాగే, ఇక్కడ చిక్కుకుపోయిన నౌకల్ని కూడా ప్రయాణించేందుకు అనుమతివ్వనున్నారు. ఇరాన్, అమెరికా మధ్య యుద్ధం ప్రారంభమైన ఫిబ్రవరి 28 నుంచి హార్ముజ్ మూసి ఉన్న సంగతి తెలిసిందే. మధ్యలో కొన్ని గంటలు మాత్రమే హార్ముజ్‌ను ఇరాన్ ఓపెన్ చేసింది. ఆ తర్వాత వెంటనే తిరిగి మూసేసింది. అనంతరం అమెరికా కూడా ఈ జలసంధిని దిగ్బంధించింది. ఈ మధ్య కాలంలో కొన్ని నౌకలకు మాత్రం అనుమతి లభించింది. ఇక, ఇక్కడ చిక్కుకుపోయిన నౌకల్ని విడిపించేందుకు అమెరికా ప్రాజెక్ట్ ఫ్రీడమ్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. వాణిజ్య నౌకలకు రక్షణగా, అమెరికా యుద్ధ విమానాల్ని మోహరించాలనుకుంది. కానీ, ఇరాన్‌తో చర్చల్లో ముందడుగు పడటంతో ప్రాజెక్ట్ ఫ్రీడమ్‌ను ఆపేస్తున్నట్లు అమెరికా తెలిపింది. మరోవైపు ఇరాన్‌తో చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. హార్ముజ్ జలసంధి అందుబాటులోకి వస్తే అంతర్జాతీయంగా చమురు అందుబాటులోకి వస్తుంది.

## హార్ముజ్ జలసంధి దాటిన 11భారత నౌకలు..



ఇరాన్--అమెరికా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి హార్ముజ్ జలసంధిని మూసేసిన సంగతి తెలిసిందే. దీంతో ఇండియా సహా అనేక దేశాలకు చెందిన నౌకలు ఈ జలసంధి వద్దే చిక్కుకుపోయాయి. ఈ నేపథ్యంలో జలసంధిలో చిక్కుకుపోయిన భారత నౌకలపై కేంద్ర విదేశాంగ శాఖ ఒక ప్రకటన చేసింది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ దీనిపై ప్రకటన చేశారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 11 భారత నౌకలు జలసంధిని దాటాయని ఆయన వెల్లడించారు. ఇంకా 13 నౌకలు పర్షియన్ గల్ఫ్ వద్ద చిక్కుకుపోయినట్లు తెలిపారు. మిగిలన నౌకలు తిరిగి ఇండియా సురక్షితంగా చేరేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నట్లు జైశ్వాల్ చెప్పారు. ఈ విషయంలో ఇరాన్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఇరాన్‌తో చర్చలు, సంప్రదింపుల తర్వాత ఇండియా ఈ అంశంలో ముందడుగు స్థితిలోనే ఉందన్నారు. 11 నౌకలు హార్ముజ్ నుంచి సురక్షితంగా ఇండియా చేరాయన్నారు. మిగిలిన నౌకల్ని కూడా ఇండియా రప్పించేందుకు ఇరాన్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ చమురు రవాణాకు సంబంధించి హార్ముజ్ జలసంధి అత్యంత కీలకం అనే సంగతి తెలిసిందే. హార్ముజ్ మూసివేయడంతో అనేక దేశాలు చమురు సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఈ సమస్య పరిష్కారం కోసం ఇండియా సహా అనేక దేశాలు ఎదురుచూస్తున్నాయి. ప్రస్తుతం అనేక దేశాలకు చెందిన నౌకలు ఇంకా అక్కడే చిక్కుకుపోయాయి.

# రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అకాల వర్షం

ఆంధ్రప్రదేశ్ దిగువ ట్రోపో ఆవరణములో ఆగ్నేయ, నైరుతి గాలులు వీస్తున్నాయని దీని ప్రభావంతో మరో రెండు రోజులపాటు పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. రేపు(శుక్రవారం) అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రఖర్ జైన్ సూచించారు. ఉరుములతో కూడిన వర్షం పడేటప్పుడు పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు, పశు కాపరులు చెట్ల కింద నిలబడరాదని హెచ్చరించారు. మరోవైపు అల్లూరి జిల్లా జీకే వీధి మండలంలో రేపు తీవ్ర వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. అల్లూరి జిల్లా ముంచింగిపుట్టు, పెదబయలు మండలాలు, తూర్పుగోదావరి జిల్లా గోకవరం, పోలవరం జిల్లా చింతూరు, కూనవరం, వర రామచంద్రాపురం, గుర్తేడు మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు. కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా ఎండ ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు.

మరోవైపు మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అకాల వర్షం కురిసింది. అనంతపురం జిల్లా తాడిపత్రిలో గాలివాన బీభత్సం సృష్టించింది. పలుచోట్ల భారీ ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. 25 సంవత్సరాల పైబడిన పెద్ద వృక్షాలు వేర్లతో సహా కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది.

కొన్ని చోట్ల విద్యుత్ తీగలు నేలమీద పడకపోవడంతో ప్రమాదకర పరిస్థితులు తప్పాయి. పెద్ద వృక్షాలు కూలిపోయిన సమయంలో చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఒక పెద్ద వృక్షం ప్రధాన రహదారిపై పడడంపై గాలి బీభత్సం ఉండడం రాకపోకలు నిలిచిపోవడం



వలన పెను ప్రమాదం తప్పింది. దీంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రజలను హెచ్చరించారు.

ప్రధాన సెంటర్లు జలమయం

కృష్ణా జిల్లా కోడూరు మండలంలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం ఎడతెరిపి లేకుండా కురుసింది. తెల్లవారుతుండగానే ఆకాశంలో మబ్బులు కమ్మి ఉన్నట్టుండి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఒక గంటకు పైగా వర్షం కురిసింది. గత వారం రోజుల నుంచి ఎండలు, వడగల్పులు, ఉక్కపోతతో అల్లాడుతున్న మండల ప్రజలకు వాతావరణం చల్లబడి వర్షం కురుస్తుండడంతో కాస్త ఉపశమనం దొరికినట్లు అయింది. తెల్లవారగానే అవనిగడ్డ - కోడూరు మధ్య 33 కేవీ విద్యుత్ లైన్?లో అంతరాయం ఏర్పడడంతో కోడూరులో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అకాల వర్షంతో పెడనలో ప్రధాన సెంటర్లు జలమయమయ్యాయి.

**రైతులను నిండా ముంచిన అకాల వర్షం**

తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంలో కురిసిన అకాల వర్షం రైతులను నిండా ముంచింది. భారీ వర్షానికి రహదారిపై, కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యం నీటమునిగింది. మొక్కజొన్న, మిరప పంట నేలవాలింది. చేతికి వచ్చిన పంట నీటి పాలు కావడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. మార్కాపురం జిల్లా త్రిపురాంతకం మండలంలో ఉరుములు మెరుపులతో కూడిన ఓ మోస్తారు వర్షం పడింది. వెల్లంపల్లిలో ఓ ఇంటి వద్ద ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగాయి. స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

# ఐదెకరాల్లో అత్యాధునిక ఫోరెన్సిక్ ల్యాబ్

నేరాలకు చెక్ పెట్టే శాస్త్రీయ శక్తి ఇప్పుడు అమరావతిలో సిద్ధమైంది. చిన్న ఆనవాళ్లే పెద్ద సాక్ష్యాలుగా మారే ఫోరెన్సిక్ సామర్థ్యంతో దర్యాప్తు వేగం, కచ్చితత్వం పెరగనుంది. అంతర్జాతీయ ప్రమాణాల ల్యాబ్‌తో నేరస్థులకు తప్పించుకునే మార్గాలు మరింత కఠినం కానున్నాయి. నేర పరిశోధనలో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లు కీలక ఆధారంగా మారాయి. రక్తం, లాలాజలం, వెంట్రుకలు, చర్మ కణాలు వంటి సూక్ష్మ ఆనవాళ్లను విశ్లేషించి డీఎన్ఏ ప్రొఫైలింగ్ ద్వారా నిందితులను గుర్తించడం సాధ్యమవుతోంది. ప్రత్యక్ష సాక్షులు లేని కేసుల్లో కూడా ఈ శాస్త్రీయ నివేదికలు కోర్టుల్లో బలమైన సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. డిజిటల్ ఫోరెన్సిక్ ద్వారా సైబర్ నేరాలు, ఆర్థిక మోసాల్లో తొలగించిన డేటాను తిరిగి పొందడం దర్యాప్తునకు కీలకంగా మారింది.

**సీఆర్‌డీఏ భవనం తర్వాత రెండోది**

రాజధాని అమరావతిలోని తుళ్లూరు వద్ద ఎన్-14, ఈ-5 జంక్షన్‌లో నిర్మించిన ఫోరెన్సిక్ భవన సముదాయం పూర్తయింది. ఐదెకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ అంతర్జాతీయ స్థాయి ఫోరెన్సిక్ ల్యాబ్ ఐదు భవనాల సముదాయంగా సిద్ధమైంది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.252 కోట్ల వ్యయంతో నిర్మాణం పూర్తయింది. 2017లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు మధ్యలో నిలిచిపోయినా, 2024 తర్వాత మళ్లీ వేగం అందుకుని పూర్తి దశకు చేరుకుంది. త్వరలోనే అత్యాధునిక పరికరాలు అమర్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఇది ప్రారంభం కానుంది. సీఆర్‌డీఏ భవనం తర్వాత రాజధానిలో ప్రారంభంకానున్న రెండో భవన సముదాయం ఇదే కావటం విశేషం.

**రూ.41 కోట్ల ఖర్చుతో పరికరాలు**

దేశంలోని ఎనిమిది అత్యాధునిక ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌ల్లో అమరావతి ల్యాబ్ ఒకటిగా నిలవనుంది. ఈ ల్యాబ్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, బాలిస్టిక్ విభాగాలు ప్రత్యేకంగా పనిచేస్తాయి. ఆటోమేటెడ్ ఫింగర్‌ప్రింట్ సిస్టమ్ ద్వారా వేలిముద్రలను డేటాబేస్‌తో సరిపోల్చి నిందితులను గుర్తిస్తారు.



కాల్పుల కేసుల్లో తుపాకులు, తూటాల విశ్లేషణ, విషప్రయోగం లేదా మత్తు పదార్థాల కారణాలను నిర్ధారించే టాక్సికాలజీ పరీక్షలు నిర్వహిస్తారు. నార్కోటిక్స్, బయోమెట్రిక్, ఫోరెన్సిక్ అకౌంటింగ్ వంటి విభాగాలు కూడా దర్యాప్తును మరింత సమగ్రంగా మార్చనున్నాయి. పాత విధానాల్లో నెలలు పట్టే నివేదికలు ఇప్పుడు గంటలు లేదా కొన్ని రోజుల్లో అందేలా సాంకేతికతను వినియోగిస్తున్నారు. వీటిలో అవసరమైన పరికరాలను రూ.41 కోట్ల ఖర్చుతో పోలీసు శాఖ తెప్పిస్తోంది.

**ఇకపై క్రిమినల్ కేసుల విచారణ సులభతరం!**

డీఎన్ఏ, నార్కోటిక్స్, సైబర్, బయోమెట్రిక్, బాలిస్టిక్ లాంటి పరీక్షలతో పాటు ఫోరెన్సిక్ అకౌంటింగ్‌కు సంబంధించిన ఎక్సలెన్స్, గత నేరాల నమూనాలతో సరిపోల్చగల డేటాబేస్ యాక్సిక్ కూడా ఇక్కడ అందుబాటులోకి రానుంది. రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ ఎఫ్ఎస్ఎల్ వాహనాల ద్వారా ఘటనా స్థలానికి వెంటనే చేరుకుని ఆధారాలు సేకరించి 48 గంటల్లో ప్రాథమిక విశ్లేషణ అందించే వ్యవస్థను అమలు చేస్తున్నారు. నేర పరిశోధనలో రక్తం, లాలాజలం, వెంట్రుకలు, చర్మకణాలు వంటి సూక్ష్మ ఆనవాలను విశ్లేషిస్తారు. అలాగే డీఎన్?ఏ ప్రోఫైలింగ్? ద్వారా నిందితులను గుర్తించడంలో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్?లు కీలకంగా మారనున్నాయి. ప్రాంతీయ ల్యాబ్‌ల విస్తరణతో దర్యాప్తు వేగం మరింత పెరుగుతోంది. అమరావతిలోని ఫోరెన్సిక్ భవన సముదాయం కార్యాకలాపాలు ప్రారంభమైతే రాష్ట్రంలో క్రిమినల్ కేసుల విచారణ సులభతరం కానుంది.

రాష్ట్రంలో నేరం చేసినవారు తప్పించుకోలేరనే నమ్మకాన్ని బలోపేతం చేసే దిశగా పోలీసుశాఖ ఫోరెన్సిక్ విభాగాన్ని విస్తరిస్తోంది. కర్నూలు, గుంటూరు, విశాఖపట్నంతో పాటు ఇతర ప్రాంతాల్లో ల్యాబ్‌ల ఏర్పాటు కొనసాగుతోంది. సిబ్బంది నియామకాలు, ఆధునిక సాంకేతిక సదుపాయాలతో ఈ వ్యవస్థను బలోపేతం చేస్తూ, నేరాలపై కఠిన నియంత్రణ లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

# పక్క చూపులు చూస్తున్న నేతలు

**గుంటూరు :** ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చాలామంది నేతలు గుడ్ బై చెప్పారు. ఎన్నికల ముందు వచ్చిన వారు ఎలాగోలా ఛాన్స్ దక్కించుకున్నారు. కానీ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత చాలామంది నేతలు చేరారు. కానీ అటువంటి వారికి ఎటువంటి పదవులు లేవు. కూటమి ప్రభుత్వంలో సరైన గౌరవం దక్కడం లేదు. స్థానికంగాను కూటమినేతలు వారిని కలుపుకెళ్లడం లేదు. కేవలం భవిష్యత్తు రాజకీయ అవసరాలు, హామీ మేరకు మాత్రమే వారు కూటమి పార్టీల్లో చేరారు. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజనతో తమకు పోటీకి అవకాశం దక్కుతుందని భావించి ఎక్కువమంది వైసీపీని వీడారు. అయితే ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన బిల్లును కేంద్రం ఉపసంహరించుకుంది. అదే సమయంలో కూటమి పార్టీల్లో సరైన గౌరవం దక్కడం లేదు. దీంతో వైసీపీని వీడి కూటమిలో చేరిన నేతలు ఆందోళనతో ఉన్నారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక వెలుగు వెలిగారు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి. ఆయన రాజశేఖర్ రెడ్డికి సమీప బంధువు కూడా. రాజశేఖర్ రెడ్డి తోడల్లుడు వైవి సుబ్బారెడ్డి. ఆయన బావ వరుస అవుతారు బాలినేని. అందుకే రాజశేఖర్ రెడ్డి ఆయనకు ఎనలేని ప్రాధాన్యమిచ్చారు. చిన్న వయసులోనే అసెంబ్లీ టిక్కెట్ ఇప్పించి గెలిపించుకున్నా రు. మంత్రి పదవి కూడా ఇచ్చారు. ఆ తర్వాత జగన్ వెంట అడుగులు వేసిన



బాలినేనికి ఎనలేని ప్రాధాన్యం దక్కుతూ వచ్చింది. కానీ చిన్న చిన్న కారణాలతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దూరమైన బాలినేని పవన్ కళ్యాణ్ కు దగ్గర అయ్యారు. జనసేనలో కూడా చేరారు. ఏడాదిన్నర దాటుతున్న ఎటువంటి గుర్తింపు లేదు ఆయనకు. భవిష్యత్తులో ఒంగోలు నుంచి పోటీ చేస్తామనే పరిస్థితి కూడా లేదు. నియోజకవర్గాల పునర్విభజన కూడా ఉండదని తేలిపోయింది. దీంతో ఏం చేయాలో బాలినేనికి పాలు పోవడం లేదుమరో మాజీ మంత్రి ఆళ్ల నాని పరిస్థితి కూడా అలానే ఉంది. ఏలూరు నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన ఆయనకు డిప్యూటీ సీఎం ఇచ్చి మరి గౌరవించారు జగన్మోహన్ రెడ్డి. మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ఆయన పార్టీకి గుడ్ బై చెప్పారు. తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. అయితే ఆయన రాకను ఏలూరు టిడిపి క్యాడర్ వ్యతిరేకించింది. కేవలం పునర్విభజనతో ఏదో ఒక నియోజకవర్గంలో నుంచి పోటీ చేయవచ్చు అన్న ఆలోచనతోనే ఆయన టిడిపిలో చేరారు. కానీ ఇక్కడ పరిస్థితి బాగాలేదు. నియోజకవర్గాల పునర్విభజన జరిగే పని కాదు. ఆయన సైతం ఇప్పుడు డిఫెన్స్ లో పడిపోయినట్లు తెలుస్తోంది.మరోవైపు మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ పరిస్థితి కూడా అలానే ఉంది. రాజ్యసభ పదవి వదులుకొని మరి ఆయన టిడిపిలో చేరారు. నియోజకవర్గాల పునర్విభజన తో తన కుమారుడికి పోటీ చేసే అవకాశం దక్కుతుందని అంచనా వేసి ఆ నిర్ణయానికి వచ్చారు. కానీ ఇక్కడకు వచ్చాక టిడిపి శ్రేణులు ఆయనను పట్టించుకోవడం లేదు. పైగా రేపల్లెలో అనగానే సత్యప్రసాద్ పట్టు బిగిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో భవిష్యత్తు భరోసా లేక సతమవుతున్నారు మోపిదేవి వెంకటరమణ. ఈ ముగ్గురు నేతలు అనవసరంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడిపోయామన్న బాధతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఏం చేయాలో వారికి పాలు పోవడం లేదు. అయితే కొద్ది రోజులు వేచి చూసి ఒక నిర్ణయానికి రావాలని భావిస్తున్నట్లు సమాచారం.

## రవాణా వ్యయం భారీగా తగ్గాలి

-మొదటిపేజీ తరువాయి

రోడ్, రైల్ కనెక్టివిటీ పెరగాలని సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రానికి రూ. లక్ష కోట్లకు పైగా విలువైన 64 జాతీయ రహదారి ప్రాజెక్టులు వస్తున్నాయని తెలిపారు. అలాగే రూ.64 వేల కోట్ల విలువైన 624 రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయన్నారు. వీటితో పాటు రూ.2 లక్షల కోట్ల ప్రాజెక్టులు డీపీఆర్ దశలో ఉన్నాయన్నారు. ఎక్స్ ప్రెస్, లోకల్ ట్రైన్స్ లాంటి ప్రాజెక్టులు వస్తాయని 4 లేన్లతో రైల్వే మార్గాల విస్తరణ జరగబోతోందని వెల్లడించారు. ఆర్వోబీలు యుద్ధ ప్రాతిపదికన పూర్తి కావాలని చంద్రబాబు స్పష్టం చేశారు. లాజిస్టిక్స్ పార్కులు వస్తే పెద్ద ఎత్తున ఎకనామిక్ యాక్టివిటీ వస్తుందన్నారు. ఎల్?నినో ప్రభావంతో వర్షాలు తక్కువ పడే అవకాశం ఉందని దీనికి తగ్గట్టు కలెక్టర్లు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాధార పంటలు, మెట్ట పంటలు, ఉద్యాన పంటలకు అనుగుణంగా నీటి ప్రణాళికలు చేసుకోవాలన్నారు. పశువులకు దాణాకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. గ్రీన్ కవర్ పెరగాలని అటవీ శాఖ దీనిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్థానిక ఎన్నికలను త్వరలో నిర్వహిద్దామని వెల్లడించారు. స్వచ్ఛ రథాల ద్వారా వ్యర్థాల సేకరణ స్వచ్ఛ రహదారుల శుభ్రతపై దృష్టి పెట్టండని అధికారులకు సూచించారు.

**స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్**

ఈ సందర్భంగా "ఆఫీస్ టెల్స్ యూ డేటా ఫీల్డ్ టెల్స్ యూ ట్రూత్" అనే విషయాన్ని అధికారులు గుర్తుపెట్టుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ అనేది నినాదాలకే పరిమితం కావొద్దని హితవుపలికారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లడం తప్పనిసరి అని తేల్చిచెప్పారు. ఫలితాలు రాబట్టే దిశగా యంత్రాంగం పనితీరు ఉండాలన్నారు.

**సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్ల సహాయంతో**

అలాగే సమాచార, పౌరసంబంధాలశాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐ అండ్ పీఆర్ వ్యవస్థ పనిచేయకుండా కేవలం ఓ ఆభరణంలా తయారైందని మండిపడ్డారు. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్లను ఎందుకు ఉపయోగించుకోవడం లేదని ప్రశ్నించారు. స్థానికంగా ఉండే ఇన్ఫ్లూయెన్సర్ల సహాయంతో ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. కొందరు అధికారుల పనితీరు అభివృద్ధిని అడ్డుకునేలా ఉండటం సరికాదన్నారు. పోడు వ్యవసాయాన్ని అడ్డుకుంటామంటే అరకులో కాఫీ పంట ఉంటుందా? అని సీఎం ప్రశ్నించారు. అధికారుల తమ తీరు మార్చుకొని అభివృద్ధికి ఊతమివ్వాలని హితవు పలికారు.

## పిఠాపురంలో జనసేనదే పైచేయి

-మొదటిపేజీ తరువాయి

ఉంది. ఇందులో భాగంగానే పిఠాపురంలో చోటు చేసుకుంటున్న వరుస వివాదాలకు సంబంధించి తెదేపా అధినేత చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న ఎస్‌వీఎస్ఎన్ వర్మను తప్పించారు. అక్కడ పార్టీ వ్యవహారాల కోసం వీలైనంత త్వరగా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు పార్టీ కసరత్తు ప్రారంభించింది. తెలుగుదేశం పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా పూర్తిగా సహకరిస్తానని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ వెల్లడించారు.

## సింగపూర్ తరహా అభివృద్ధికి ప్రణాళికలు

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి నిర్దేశించిన ప్రాజెక్టులపై ఎక్కువ ఖర్చు పెట్టాలన్నారు. ప్రజలకు ఫలితాలను చూపించేలా పని చేయాలన్నారు. బడ్జెట్?ను దాటి ప్రతిపాదనలు చేయటం సరికాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ఏ ప్రాజెక్టులు అవసరమో దానిపై దృష్టి పెట్టాలని మంత్రి పయ్యావుల కేశవ్ సూచించారు.

**500 రకాల సేవలు**

సింగపూర్ తన పనులను చాలా ఖచ్చితంగా, సమన్వయంతో చేయడంలో మేటి అని మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ తనకున్న విస్తృతమైన వ్యవస్థను, సింగపూర్ లాంటి ఖచ్చితత్వంతో కలిపి ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో మంత్రి అనగాని సత్యప్రసాద్ సింగపూర్ పర్యటన అనుభవాలను పంచుకున్నారు. మనం 500 రకాల సేవలను అందిస్తున్నప్పటికీ సింగపూర్ లాగా వాటన్నింటినీ ఒకే చోట, సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న బలమైన వ్యవస్థలైన ఆర్టీజీఎస్, మీ భూమి, సింగిల్ డెస్క్ వంటి వాటిని సింగపూర్ మాదిరి ఒకదానితో ఒకటి అనుసంధానించాలి. ఏపీ ప్రభుత్వం పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తున్నప్పటికీ సింగపూర్ ప్రభుత్వం మాదిరి పరిశ్రమలు రాక ముందే భూమిని, మౌళిక వసతులను సిద్ధం చేసి ఉంచేలా పని చేయాలి. ఏపీలో ప్రభుత్వ శాఖలు, జిల్లా పరిపాలన పటిష్టంగా ఉన్నప్పటికీ సింగపూర్ లాగా అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పని చేసేలా చూసుకుంటే మంచి ఫలితాలు దక్కుతాయి.'

సీఎం సూచనలు: మంత్రుల సింగపూర్ పర్యటనపై జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఇచ్చిన ప్రజెంటేషన్ తదితర అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. నేర్చుకోవటం అనేది నిరంతర ప్రక్రియ, అత్యుత్తమ విధానాలు ఎక్కడున్నా అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. సింగపూర్?లో అనుసరిస్తున్న పాలనా విధానాలు అక్కడి ప్రజల విశ్వాసాన్ని దక్కించుకున్నాయన్నారు. సింగపూర్?లోని అత్యుత్తమ విధానాలను తీసుకుని ఓ జిల్లాను మోడల్?గా అభివృద్ధి చేద్దామని సూచించారు. సింగపూర్ విధానాల అమలుకు 90 రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేసి పర్యవేక్షణ చేయాలన్నారు. 'నేను కాదు మనం' అనే విధానంలో ముందుకు వెళ్దాం, ఈ విధానం ఇవాళ్టి నుంచి తనతో మొదలవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.

## ఏపీ జననాయకుడిగా లోకేష్

**విజయవాడ :** తెలుగుదేశం పార్టీలో నారా లోకేష్ ప్రాధాన్యత అందరికీ తెలిసిందే. ఆయన చంద్రబాబు తరువాత స్థానంలో ఉన్నారు. ఈ మధ్యనే ఆయనకు పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని కూడా ఇచ్చారు బాబు ఆయనతో ప్రమాణం చేయించారు. ఇక ప్రభుత్వంలో కీలక శాఖలను చూస్తున్న యువ మంత్రిగా ఉన్నారు. అలా పార్టీ ప్రభుత్వంలో లోకేష్ ప్రాధాన్యతమైన ప్రభావవంతమైన పాత్ర నిర్వహిస్తున్నారు. అయితే ఇది మాత్రమే సరిపోదని జనాలకు పార్టీ జనాలకు లోకేష్ మరింతగా కనెక్ట్ కావాల్సిన అవసరం ఉందని పార్టీ భావిస్తోంది అని అంటున్నారు. రాష్ట్రంలో చూస్తే పక్కా మాస్ లీడర్ గా లోకేష్ ని చూపించాలన్న వ్యూహం టీడీపీకి ఉందని అంటున్నారు. లోకేష్ ఇప్పటికే పార్టీ వారిని కలుస్తున్నారు. ప్రభుత్వంలో మంత్రులతో కూడా ఇంటరాక్ట్ అవుతున్నారు. ఎమ్మెల్యేలతో కూడా ఆయన కలసి మెలసి ఉంటున్నారు. క్యాడర్ కి దగ్గరగా ఉండడం చేస్తున్నారు. అయితే ఇది చాలదని అంత కంటే ఎక్కువగా జనంలో ఉండేలా ఒక బృహత్ కార్యక్రమం పార్టీ పెద్దలు డిజైన్ చేస్తున్నారు. అది ఎంతలా అంటే లోకేష్ పేరు జన బాహుళ్యంలో మారు మోగేలా అని అంటున్నారు. లోకేష్ యువగళం పాదయాత్ర సమయంలో తనలోని నాయకత్వ లక్షణాలను బయటపెట్టారు. దాంతో అందరూ ఆయనలోని కొత్త కోణాన్ని చూశారు అలా ఒకేసారి లోకేష్ పది మెట్లు ఎక్కేశారు. అయితే ఇపుడు పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో లోకేష్ మళ్ళీ జనంతో కనెక్ట్ కావాల్సి ఉందని భావిస్తున్నారు. ఇక నారా లోకేష్ విషయం తీసుకుంటే ఆయన 2023లో చేపట్టిన యువగళం పాదయాత్ర సూపర్ సక్సెస్ అయింది అంతకు ముందు ఆ తరువాత అన్నట్లుగా లోకేష్ పాత్రను మార్చేసింది. ఇక ఆ మీదట టీడీపీ కూటమి విజయం సాధించడం లోకేష్ ప్రభుత్వంలో మంత్రిగా ఉండడం గడచిన రెండేళ్ళలో తన సత్తాను తన శాఖలల నిరూపించుకోవడం వంటివి జరుగుతున్నాయి. అయితే ఈసారి అలా కాదు, 2029 ఎన్నికల నేపథ్యంలో లోకేష్ ఇంతకు ఇంత రాజకీయంగా రాటు తేలాలీ అంటే జనంలో నిత్యం ఉండేలా పార్టీ రాష్ట్ర స్థాయి పర్యటనలు కార్యక్రమాలు డిజైన్ చేస్తోంది అని అంటున్నారు ఫుల్ ఫోకస్ ఉండేలా : ఏపీలో చంద్రబాబుకు దిగ్గజ నేతగా పేరుంది. ఆయన వారసుడిగా లోకేష్ కి పార్టీలో ఎదురులేదు, యాక్సెప్టెన్స్ ఉంది. అయితే జనసామాన్యంలో కూడా దానికి బలమైన ఆమోదం అవసరం అన్నదే పార్టీ వ్యూహకర్తల భావనగా ఉంది. చంద్రబాబు తరువాత సిసలైన నాయకుడు పార్టీకే కాదు రాష్ట్రానికి రేపటి రాష్ట్ర భవిష్యత్తుకూ లోకేష్ అని ఏపీలోని ఆరు కోట్ల జనాలు అంతా ఆమోదించేలా ఉండాలీ అంటే లోకేష్ మరింతగా జనంలో ఉంటూ తన సత్తాను నిరూపించుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు. దాని కోసమే పార్టీ ఒక భారీ యాక్షన్ ప్లాన్ ని రూపొందిస్తోంది అని అంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలీ అంటే లోకేష్ మీదనే ఫుల్ ఫోకస్ ఉండేలా టీడీపీ పథక రచన చేస్తోంది అని అంటున్నారు. పార్టీ అధినేత వేరు, మంత్రిగా సామర్థ్యం వేరు, ఆరు కోట్ల మంది ఉన్న ఒక రాష్ట్రాన్ని నడిపించే అధినేతగా ఉండడం వేరు.

# గోవిందా.....గోవింద..........గోవింద నామస్మరణతో జమ్మలమడుగు ఆధ్యాత్మిక తరంగంలో మునిగింది

## బ్రహ్మోత్సవాల్లో భాగంగా వైభవంగా రథోత్సవం
## -- లక్షలాది భక్తులతో కిక్కిరిసిన పట్టణం
## -- కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాలతో మారుమోగిన వీధులు

**ప్రజా జ్యోతి న్యూస్ జమ్మలమడుగు** జమ్మలమడుగు పట్టణం బ్రహ్మోత్సవాల వేళ భక్తిరసంలో మునిగిపోయింది. "గోవింద... గోవింద..." అనే నామస్మరణలతో పట్టణమంతా మారుమోగిపోగా, స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన మహా రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారి దర్శనం కోసం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు.అలంకరించిన మహారథంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వగా, రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. ప్రధాన రహదారులన్నీ భక్తులతో నిండిపోవడంతో జమ్మలమడుగు పట్టణం జనసంద్రంగా మారింది. ఎటు చూసినా "గోవిందా గోవిందా" అంటూ వినిపించిన నామస్మరణలు ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని రెట్టింపు చేశాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన కోలాటాలు, భజనలు, హారతులు, మంగళవాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో కోలాటాలు ఆడుతూ భక్తి పరవశంలో మునిగిపోయారు. యువకులు భజన బృందాలతో పాల్గొని స్వామివారి మహిమను కీర్తించారు. పట్టణంలోని ప్రతి వీధి విద్యుత్ దీపాలతో అలంకరించబడగా, భక్తుల సందడి కారణంగా పండుగ వాతావరణం నెలకొంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. వైద్య శిబిరాలు, తాగునీటి సదుపాయాలు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసి భక్తులకు సేవలు అందించారు. జమ్మలమడుగు బ్రహ్మోత్సవాలు ప్రతి ఏడాది భక్తి వైభవానికి ప్రతీకగా నిలుస్తుండగా, ఈసారి జరిగిన రథోత్సవం మరింత ఘనంగా, చారిత్రాత్మకంగా నిలిచిందని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.



## రాయితీపై వ్యవసాయ యంత్రాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలి

– ఏఓ అమర్నాథ్ రెడ్డి



**దువ్వూరు,మే7 ( ప్రజా జ్యోతి )** రైతులకు మేలు చేకూర్చే ఉద్దేశ్యంతో ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ యంత్రీకరణ పరికరాలను అందజేస్తోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని గురువారం మండల వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.అందులో భాగంగా దువ్వూరు మండలానికి ట్రాక్టర్లు –3 ట్రాక్టర్ పరికరాలు –5 విత్తన గోరు –1 పవర్ స్ప్రేయర్స్ –36 నూర్పిడి యంత్రం –1 పవర్ విడర్–5 బేలర్ / ట్రాలీ / చాఫ్ కట్టర్ –1 మంజూరైనవి. వీటిని దరఖాస్తు చేసుకునే దానికి ఆన్లైన్లో ఈ దిగువ తెలిపిన లింకు ద్వారా రైతు నేరుగా దరఖాస్తు చేసు కోవచ్చు హ్ట్టజూం://వంవవన.ఖజూ.న్రశీజ.అఅ/ళీవీ/ లేదా మీ గ్రామంలోని రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవ సాయ సహా యకులను మరింత సమాచారం మరియు దరఖాస్తు కొరకు సంప్రదించవచ్చని.మే 19 వ తారీకు వరకు దరఖాస్తు చేసు కునే అవకాశం ఉన్నది దరఖాస్తు చేసుకున్న అప్లికేషన్లు,అన్నీ లాటరీ పద్ధతి ద్వారా లబ్ధిదారుని ఎంపిక చేసి ఎన్నికైన లబ్ధిదారులు 15 రోజుల లోపల రైతు వాటా చెల్లించి వ్యవసాయ పరికరాలు పొందవలసి ఉంటుందని తెలిపారు.కావున దువ్వూరు మండలంలోని రైతులు కావాల్సిన పరికరాలు దరఖాస్తు వకాశాన్ని సద్వినియోగం వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డి తెలిపారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కోసం పోరాటం కొనసాగిస్తాం

**ఈ నెల 11 న ఎమ్మిగనూరులో జరుగు దళిత క్రైస్తవుల శాంతి ర్యాలీకి సంపూర్ణ మద్దతు**

**నూతనంగా పట్టాభిషేకం పొందిన ఫాదర్ రవితేజ ను సన్మానించిన దళిత నేతలు**

**మే 07 ( ప్రజా జ్యోతి ఎమ్మిగనూరు అర్బన్ ప్రతినిధి )** షెడ్యూల్ కులాలకు చెందినవారు మతం మారినంత మాత్రాన వారి సామాజిక పరిస్థితులు, హోదా ఎక్కడ మారలేదని, పెరగలేదని ఎస్సీలకు మతముతో సంబంధం లేకుండా రిజర్వేషన్లు కల్పించాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన సాధన కమిటి చైర్మన్ కదిరికోట ఆదెన్న, నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ (యన్.సి.సి) కర్నూలు జిల్లా కార్యదర్శి కదిరికోట వెస్లీ సునీల్ లు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎస్సీ కాలనీలో ఆర్.సి.ఎం. చర్చికి సంబంధించి ఇటీవల నూతనంగా పట్టా భిషేకం పొందిన ఫాదర్ మాసి పొగు రవితేజ ను వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో ఆత్మీయంగా సన్మానించి అభినందనలు, శు భాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఏర్పాటుచేసిన తేనీటి విందులో పాల్గొని దళిత క్రైస్తవులు, పాస్టర్లు, సువార్తికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీలు క్రైస్తవ మతం మారితే రిజర్వేషన్లు పొందలేరని, ఎస్సీ హోదా కోల్పోతారని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు. దళితులకు మత స్వాతంత్ర్య హక్కును హరించి వేస్తున్న 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పును పునర్విచారణ చేసేలా రాజ్యాంగ బెంచ్ కు పంపాలని కోరారు. దళిత క్రైస్తవులపై దాడులను అరికట్టాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.



**ఈ నెల 11న దళిత క్రైస్తవుల శాంతి ర్యాలీకి మద్దతు:–**

ఈ నెల 11న మతం మారిన దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కొనసాగించాలని ఎమ్మిగనూరు నియోజకవర్గ పాస్టర్ల కమిటి పట్టణంలో ఎం.బి.చర్చి నుండి ఎమ్మార్వో ఆఫీస్ వరకు తలపెట్టిన దళిత క్రైస్తవుల శాంతి ర్యాలీ కి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని కదిరికోట ఆదెన్న పేర్కొన్నారు. ఈ ర్యాలీకి దళిత క్రైస్తవులు పార్టీలకతీతంగా పెద్ద ఎత్తున హాజరై ఐక్యతను ప్రదర్శిస్తూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు రోజా ఆర్ట్స్ ఉసేని, కెవిపిఎస్ నాయకులు సుమాల అంతోని, దళిత క్రైస్తవ యువకులు మద్రి సురేష్, సందెపోగు జయరాజు, కదిరి కోట ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వైస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై.నైరుతి రెడ్డి జన్మదిన వేడుకలు






**గుంతకల్లు మే 7 (ప్రజా జ్యోతి):** వైస్సార్సీపీ గుంతకల్లు నియోజకవర్గం సమన్వయకర్త,మాజీ శాసన సభ్యులు వై.వెంకటరామి రెడ్డి కుమార్తె వైస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు డైనమిక్ లీడర్ వై.నైరుతి రెడ్డి జన్మదినం సందర్భంగా పట్టణంలోని శ్రీ పొట్టి శ్రీరాములు సర్కిల్ వద్ద కేక్ కటింగ్ నిర్వహించి,అనంతరం వేసవి కాలం ఎండలు తీవ్రత ఉన్నందున పట్టణ ప్రజలకు దాహం తీర్చటం కోసం మజ్జిగ పంపిణి కేంద్రం ఏర్పాటు చేయటం జరిగింది. ఈ సందర్భంగా వైస్సార్సీపీ నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షు రాలు వై. నైరుతి రెడ్డి ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ప్రజానేత వై.నైరుతి రెడ్డి జన్మదిన వేడుకలు గుంతకల్లు పట్టణం లో అత్యంత ఘనంగా మరియు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించ బడ్డాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు,యువజన కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి హృదయపూర్వక జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పట్టణంలో ప్రజలకు మాజీగ్గా పంపిణి నిర్వహించి ఆమె సేవా భావాన్ని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే నాయకురాలిగా, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న సమర్థ మహిళా నాయకురాలిగా నైరుతి రెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందారని నాయకులు పేర్కొన్నారు. వైఎస్సార్సీపీ సిద్ధాంతాలను గ్రామస్థాయిలో బలోపేతం చేస్తూ ప్రజలకు అండగా నిలు స్తున్న ఆమె సేవలు ఆదర్శనీ యమని కొనియాడారు. రానున్న రోజుల్లో కూడా ప్రజా సేవలో మరిన్ని ఉన్నత శిఖరా లను అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకో వాలని పార్టీ శ్రేణులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ పట్టణ అధ్యక్షులు ఎం డి ఆర్. ఖలీల్, మండల అధ్యక్షులు రాము, బూత్ వింగ్ నియోజకవర్గం అధ్యక్షులు షేక్ మౌల, రైతు విభాగం నియోజకవర్గం అధ్యక్షులు బాబు రావు, యూత్ వింగ్ నియోజకవర్గం అధ్యక్షులు అబ్దుల్ బాసిత్, బీసీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు రంగనాయకులు, ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు సాయిపోగు వీరేష్, ఐటీ వింగ్ నియోజ కవర్గం అధ్యక్షులు సూర్య రెడ్డి, వైయస్సార్ ఎస్ యు రాష్ట్ర కార్యదర్శి వంశీ యాదవ్, వైయస్సార్ టి యు జిల్లా కార్యదర్శి డ్యామ్ వాలి, మాజీ మార్క్ యార్డ్ చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు దాదా ఖలందర్, యూత్ వింగ్ పట్టణ అధ్యక్షులు మనోజ్ కుమార్, కార్యదర్శులు రాఖీ, ప్రశాంత్,జాఫర్, ఎస్సీ సెల్ పట్టణ ఉపాధ్యక్షులు రాజశేఖర్, పార్టీ సీనియర్ నాయకులు నూర్ నిజామి, బిఎంవీటి మస్తాన్, రాధాకృష్ణ, అంథోని, శీనా, కాకర్ల సురేష్, దసరాత, దాదు, మైత్రి బాషా, తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధువును ఆశీర్వదించిన ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి ,

**ప్రజా జ్యోతి చెన్నూరు మే 7** చెన్నూరు మండల పరిషత్ అధ్య క్షులు చీర చీరల సురేష్ యాదవ్ కుమార్తె వధువు నాగ లిఖిత 8 తేదీన గురువారం పెళ్లి సందర్భంగా చెన్నూరు లోని వధువు ఇంటి వద్ద కడప పార్లమెంటు సభ్యులు వైయస్ అవి నాష్ రెడ్డి శుభాకాంక్షలు తెలి యచేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ల సంఘం అధ్యక్షులు ఎస్వి నారాయణరెడ్డి , ఎంపిటిసి చంద్ర, హజరత్, నీలం శ్రీనివాస్ రెడ్డి, ఆర్ సి కొండారెడ్డి, కార్తీక్ రెడ్డి, పందు, సురేష్ యాదవ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు





## మెలియాపుట్టి మండలాల్లో పలు శుభకార్యాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

**లిమెలియాపుట్టి (ప్రతినిది ) ప్రజా జ్యోతి మే 07** శ్రీకాకుళం జిల్లా మెలియాపుట్టి మండలానికి చెందిన వైఎస్ఆర్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు ఊర్లాన బాలరాజు మాస్టారు కుమార్తె గృహప్రవేశ కార్యక్రమం విశాఖపట్నంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే శ్రీమతి రెడ్డి శాంతి హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మెలియాపుట్టి మండలం జాడుపల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీ గుమ్మడి పోలమ్మ గ్రామ దేవత ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో రెడ్డి శాంతి స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమం అనంతరం ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి శాంతిని దుస్సలువతో సత్కరించి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలోా=జూ మండల అధ్యక్షులు పోలాకి జై ముని రావు,( ఎంపీపీ) బైపోత్ ఉదయ్ కుమార్, మండల యూత్ అధ్యక్షుడు పరపటి రవికుమార్ రెడ్డి స్థానిక నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హోళగుంద టాపర్ షాలి సక్లైన్ కు ఘన సన్మానం

**విద్యార్థిని ఘనంగా సన్మానించిన వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గిరి**



**హోళగుంద, మే 7, ప్రజా జ్యోతి న్యూస్–** పదవ తరగతి ఫలితాల్లో 582/600 మార్కులు సాధించి హోళగుంద మండల టాపర్గా నిలిచిన హోళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి షాలి సక్లైన్ ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.కె. గిరి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్.కె. గిరి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మార్కులు సాధించడం అభినందనీయమని కొనియాడారు.విద్యార్థి ప్రతిభ పాఠశాలకు, ఉపాధ్యాయులకు మరియు తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చిందని హర్షం వ్యక్తం చేశారు.షాలి సక్లైన్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత చదువులు చదివి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మస్తాన్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వర బాబు



**గుంతకల్లు మే 7 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు మండలంలోని గురువారం గుండాల తండా గ్రామం నందు ఎంపీటీసీ రమేష్ నాయక్ తమ్ముడు వెంకటేష్ నాయక్ మరియు ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోవింద నాయక్ కుమార్తె మరియు గుండాల తాండ గ్రామం మాజీ సర్పంచ్ ఈశు నాయక్ అన్న కుమార్తె వివాహ రిసెప్షన్ వేడుకకు వైస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే ఎన్.గాదిలింగప్ప కుమారుడు ఎన్. గాదిలింగే శ్వర బాబు ( చిన్న బాబు) హాజరై నూతన వధూవరు లను ఆశీర్వదించారు. ఆయన వెంట వైస్సార్సీపీ సీనియర్ నాయకులు వైటి చెరువు జయన్న, ఎంపీటీసీ రామాంజనేయులు, గుండాల తండా గ్రామం వైస్సార్సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనాభా గణనకు సహకరించండి

**అభివృద్ధికి తోడ్పడండి.**

**తాసిల్దార్ సయ్యద్ హుస్సేన్**



**చింతూరు మే 7 ప్రజాజ్యోతి** జనాభా గణనకు సహకరించి దేశాభివృద్ధికి తోడ్పడాలని చింతూరు తహసిల్దార్ సయ్యద్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వం వ్యాప్తంగా దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 2027 జనాభా గణన లో భాగంగా మొదటి విడత ఇండ్ల జాబితా తయారీ మే 1 నుండి మే 30 వరకు నిర్వహించబడుతోంది. ఈ సర్వే లో భాగంగా ప్రజలు ఇంటి యొక్క స్థితిగతుల వివరాల నమోదు జరుగును. తమ ఇంటికి వచ్చే గణన అధికారులకు మీ కుటుంబ వివరాలను ఖచ్చితంగా తెలియ చేయాలన్నారు. అందించే సమాచారం అత్యంత గోప్యంగా ఉంచబడుతుందని, ఇది ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పనకు ఎంతో కీలకమన్నారు . జనాభా గణనలో అందించే వివరాల వల్ల కుటుంబాలకు అందుతున్న ప్రభుత్వ పథకాలకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు .మొదటిసారిగా డిజిటల్ పద్ధతిలో జరుగుతున్న ఈ జనగణనలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు . వివరాలు – దేశ ప్రగతికి మెట్లు, కావున ప్రభుత్వ అధికారులకు సహకరించాలని , వివరాలు ఇవ్వడం వల్ల దేశాభివృద్ధికి తోడ్పడి నట్లవుతుందని తాసిల్దార్ పేర్కొన్నారు.

## తడక వారి వివాహ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్.



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :– యం. నరేష్.పాతపట్నం** మండలం కాపు గోపాలపురం గ్రామానికి చెందిన తడక శ్రీనివాసరావు ఒ విజయ దంపతుల కుమారుడు దేవేంద్ర ఒ ఇందుమతి దంపతుల వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన శాసనసభ్యులు మామిడి గోవిందరావు . ఆయనతోపాటు మండల నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాయితీపై వ్యవసాయ యంత్రాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలి




----- ఏఓ ఆనంద్ లోకదళ్

**హోళగుంద, మే 7, ప్రజా జ్యోతి న్యూస్–** రైతులకు మేలు చేకూర్చే ఉద్దేశంతో ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ యంత్రీకరణ పరికరాలను అందజేస్తోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఆనంద్ లోకదళ్ రైతులకు సూచించారు. ఈ పథకంపై అవగాహన కల్పించేందుకు మండల వ్యవసాయ అధికారి ఆనంద్ లోకదళ్ ఆధ్వర్యంలో కూటమి పార్టీ నాయకులు మరియు రైతులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పథకం అమలు తీరు, విధివిధానాల గురించి రైతులకు పూర్తిస్థాయిలో వివరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని ఆధునీ కరించే క్రమంలో రైతులకు ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు మరియు మహిళా రైతులకు 50% రాయితీ, ఇతర రైతులకు 40% రాయితీ లభిస్తుం దన్నారు. భూమి కలిగి ఉన్న రైతులు, రైతులు మరి యు గత మూడు ఏళ్లలో కనీసం మూడు సీజన్లలో ఈ పంట అప్లికేషన్‌లో నమోదు చేసుకున్న కౌలు రైతులు దరఖాస్తు చేసుకో వచ్చన్నారు. గత ఏడాది (2024–25) సబ్సిడీ పొందిన వారు మరియు ఒకే కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది దరఖాస్తు చేయడానికి వీలులేదన్నారు. ఆసక్తి గల రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో లేదా మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసు కోవాలని సూచించారు. దరఖాస్తులకు మే 5వ తేదీ నుంచి మే 19వ తేదీ అర్ధరాత్రి వరకు మాత్రమే అవకాశం ఉందని తెలిపారు. మే 23 నుండి 25 వరకు జాయింట్ కలెక్టర్ సమక్షంలో ఆన్‌లైన్ లాటరీ నిర్వహించబడుతుందనీ, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఆమోదం పొందిన తర్వాత లబ్ధిదారుల జాబితా విడుదల అవుతుందన్నారు. ఎంపికైన వారికి ఫోన్ ద్వారా సమాచారం పంపబడుతుందని తెలియజేశారు. ఎంపికైన రైతులు 15 రోజుల్లోపు రాయితీ పోను మిగిలిన మొత్తాన్ని ఆన్‌లైన్ ద్వారా డీలర్‌కు చెల్లించి, కొనుగోలు ఆర్డర్ పొందితే ఆర్డర్ ఇచ్చిన 15 రోజుల్లోపు డీలర్ యంత్రాలను సరఫరా చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ తిప్పయ్య, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఈబీజీ గోవింద గౌడ్, నాయకులు గవి సిద్దప్ప, బసవరాజు, కూటమి నాయకులు రైతులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి భద్రతపై 'స్పెషల్ డ్రైవ్'




**భద్రతా ప్రమాణాల సమీక్ష -- బ్లాక్ స్పాట్స్ గుర్తింపు**

**ప్రయాణికుల రక్షణే ప్రధాన లక్ష్యం: ఏఎస్పీ హేమంత్ కుమార్**

**ఎటపాక, మే 07 (ప్రజాజ్యోతి):** విజయవాడ -- జగదల్‌పూర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్--30) పనుల్లో భాగంగా ఎటపాక మండలం పరిధిలోని నెల్లిపాక, లక్ష్మీపురం, బండిరేవు తదితర గ్రామాల మలుపులు మరియు జంక్షన్ల వద్ద నూతనంగా నిర్మించిన రహదారిని గురువారం వివిధ శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో చింతూరు ఏఎస్పీ బి. హేమంత్ కుమార్ పాల్గొని భద్రతా అంశాలను నిశితంగా పరిశీలించారు. జాతీయ రహదారుల విభాగం అసిస్టెంట్ ఇంజనీర్ చక్రవర్తి, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ రెసిడెంట్ ఇంజనీర్ చంద్రనారాయణ, చింతూరు ఆర్టీవో చల్లారావు క్షేత్రస్థాయిలో పర్యటించి రహదారి నిర్మాణ ప్రమాణాలు, నిబంధనలను పరిశీలించారు. హైవే కాంట్రాక్టర్ మేనేజర్ పి. నాగరాజు నిర్మాణ నాణ్యత, అమలు తీరుపై అధికారులకు వివరాలు అందించారు. ముఖ్యంగా జంక్షన్ల , మలుపుల వద్ద సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, రేడియం చిహ్నాల ఏర్పాటు అంశాలపై అధికారులు చర్చించారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న 'బ్లాక్ స్పాట్స్'ను గుర్తించి అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. తనిఖీ అనంతరం అధికారులు మాట్లాడుతూ రహదారిపై ప్రయాణించే ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్మాణంలో ఎక్కడా రాజీ పడకూడదని కాంట్రాక్ట్ సంస్థను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎటపాక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. కన్నపరాజు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రంపచోడవరంలోమే24,25,26నతేదీల్లోజరిగే ఆదివాసి రేలాఉత్సవాలను జయప్రదంచేయండి





**ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ!..**

**వి.ఆర్.పురం,మే7(ప్రజాజ్యోతి ప్రతినిధి)మండలంలో** ఆదివాసి గిరిజన సంఘం మండల కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం పెద్దమట్టపల్లి పంచాయతీలో మండలఅధ్యక్షులు కారం సుందరయ్య,అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమాం మాట్లా డుతూ మే 24 25 26 తేదీన రంపచోడవరం కేంద్రంలో భారీ ఎత్తున జరగబోయే ఆదివాసి రేలాఉత్సవాలు అత్యధిక ఆదివాసి ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈఉత్సవాల్లో ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలు ఆచారాలు నేటి సమాజానికి కనబడే విధంగా కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. మే 24న మొదటి రోజు భారీప్రదర్శన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తూ సభకూడా ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఈసభకి ఆదివాసి ప్రజానీకం అత్య ధికంగా పాల్గొని జయప్రదం చేయాలని,సూచించారు. అలాగే రంపచోడవరం,కేంద్రంగా ఆదివాసి అమరవీరులు కారం తమన్న దొర, కొమరం భీమ్, బిర్సా ముండా , విగ్రహాలు ఏర్పాటు చేయాలని అలాగే గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మనసంస్కృతిని కాపాడుకుందాం, మనహక్కుల కోసం పోరాదుదుదాం అని పిలుపు ఇచ్చారు. ఈసమావేశంలో మండల కార్యదర్శి పూనెం ప్రదీప్ కుమార్ ఆదివాసీ నాయకులు సున్నం రాజులు,కారం లక్ష్మి,గొర్రె రాజు,కారం సత్తిబాబు,పండా వెంకటేష్,ముసురు రాజశ్వరి, కారం కనకమహా లక్ష్మి,పొడియం శ్రీరామమూర్తి, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

# పోలవరంనిర్వాసితుల సమస్యలు!.. 2025 వరదల నష్టపరిహారం

**రాబోవు వరదలు తదితర అంశాలపై వివరించాం!..**

**లితెలుగుదేశంపార్టీ మండల అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్!..**

**జనసేనపార్టీ అధ్యక్షులు ములకాల సాయికృష్ణ!..**

**వి.ఆర్.పురం,మే7(ప్రజాజ్యోతి ప్రతినిధి)** పోలవరం ముంపు బాధితుల సమస్యలు,2025 వరదనష్టపరిహారం,రాబోవు వరదలను దృష్టిలో పెట్టుకొని ముందస్తు జాగ్రత్తలు తీసుకో వాలని,ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, చాంబర్ లో ఉన్న వ్యక్తిగత అధికారులతో,పి.ఏ.సి,చైర్మన్, ఆహార" మరియు" పౌరసరఫరాల శాఖ మంత్రి,నాదెండ్ల మనోహర్, ఓ.ఎస్. డి,ని, కలిసి మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలు పరిష్కరి ంచాలని ,వివరిం చామని కూటమి నాయకులు, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్,జనసేన పార్టీ అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, వివరించారు. గురువారం ,అమరావతిలోని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఓ.ఎస్.డి,ని కలిసి మండల సమస్యలు పరిష్క రించాలని కోరామని చెప్పారు. జూన్,జూలై,ఆగస్టు, మాసాల్లో వరదలు, విపరీతంగా వచ్చేఅవకాశం ఉందని, నిర్వా సితులను అన్నీవిధాలుగా ఆదుకోవాలని సూచిం చామన్నారు ఫ్లడ్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరామని చెప్పారు .నిత్యా వసర సరుకుల ఏర్పాటుచేసి తాత్కాలికంగా ఆదుకోవాల ని, వీలైనంత త్వరగా,హౌస్ ట్రక్చర్ వ్యాల్యూ, ఆర్ఆర్,ఏర్పాటు చేయా లని సూచించామని,వి వరించా మన్నారు. చింతరేగ పల్లి, కన్నాయి గూడెం, చిన్నమట్టపల్లి ,పెద్దమట్టపల్లి తదితర ప్రాంతా ల్లో మొబైల్ క్లినిక్ లు,ఏర్పాటుచేసి వైద్యసేవలు అందిం చాలని ,విజ్ఞప్తిచేశామని వివరిం చామన్నారు. రామవరం, చొప్పల్లి, కుంజావారిగూడెం, తెల్లవారి గూడెం,తదితర గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి ఏజెన్సీ ప్రాంతంలో వైద్య సేవలు మెరుగు పర్చేందుకు ప్రభుత్వం సహాకారం ఉండాలని సూచిం చామ న్నారు. గత ప్రభుత్వంలో నిలిచి పోయిన రోడ్లను పూర్తి చేయాలని కోరామన్నారు. 2025 వరద నష్టపరిహారం,ఇవ్వాలని సంబంధిత అధికారులకు వినతిపత్రాన్ని అందించామని సాను కూలంగా స్పందించారని తెలిపారు. అనంతరం ఉపము ఖ్యమం త్రి కొణిదెల పవన్ కళ్యాణ్,ఛాంబర్ లో ఉన్న అధికారులతో పోలవరం నిర్వాసితుల సమస్యలు మరియు మండలంలోని ప్రధాన సమస్యల పై చర్చించడం జరిగిందని వివరించారు.



## ఇప్పిలి ధనుంజయ ని పరామర్శించిన ఎమ్మెల్యే ఎంజీఆర్.



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :- యం. నరేష్.** పాతపట్నం మండలం తీమర గ్రామ మాజీ సర్పంచ్ ఇప్పిలి ధనుంజయ ఆరోగ్యం బాగా లేదని విషయం తెలుసుకున్న వెంటనే ఈరోజు పరామర్శించిన శాసనసభ్యులు మామిడి గోవిందరావు . ఆయనతో పాటు నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

## పైల వారి వివాహ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్.



**ప్రజజ్యోతి రిపోర్టర్ :- యం. నరేష్.** పాతపట్నం మండలం తీమర గ్రామానికి చెందిన పైల పోలీసు ఒ సావిత్రమ్మ దంపతుల కుమారుడు రమణమూర్తి ఒ యామిని దంపతుల వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన శాసనసభ్యులు మామిడి గోవిందరావు . ఆయనతోపాటు మండల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కూనవరం మండల సర్వసభ్య సమావేశంలో కీలక నిర్ణయాలు

**పెండింగ్ ఎంపీటీసీ గౌరవ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్**






**కూనవరం, మే 7 (ప్రజాజ్యోతి):** కూనవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ పాయం రంగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం కీలక చర్చల మధ్య నిర్వహించారు. మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జరిగిన ఈ సమావేశంలో ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. మండల అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్య అంశాలపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు. బి.టి. రోడ్డు నిర్మాణం బోదునూరు గ్రామం నుంచి మెట్ట రామవరం వరకు అత్యవసరంగా బి.టి. రహదారి నిర్మించాలని సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. కూనవరం మండలంలో రాడార్ ఆధారంపై కాకుండా క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని కోరుతూ ల్యాండ్ అక్విజిషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించారు. రంపచోడవరంలో కొత్తగా బస్సు డిపో ఏర్పాటు చేయాలని రవాణా శాఖ అధికారులను కోరుతూ తీర్మానం చేశారు. మండలంలోని అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు తక్షణమే కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. గత రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఎంపీటీసీల గౌరవ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సభ్యులు గట్టిగా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ పాయం రంగమ్మ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అధికారులు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళలకు వార్షిక రుణాలపై అవగాహన

**---కర్నూలు జిల్లా డీఆర్డిఏ వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణారెడ్డి**



**నందవరం మే 07(ప్రజా జ్యోతి ): మండల పరిధిలో** డ్వాక్రా పొదుపు మహిళలకు ఏసీఎల్పీ 2026–27 ఆర్థిక రుణాలపై పీడీ రమణరెడ్డి, అవగాహన కల్పించారు. కర్నూలు జిల్లా నందవరం మండలము ముగతి గ్రామములో కర్నూలు జీల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా రమణారెడ్డి ఆధ్వర్యంలో 2026–27 వార్షిక రుణాలు మరియు జీవనోపాదుల ప్రణాళిక కార్యక్రమము నిర్వహించడం జరిగినది. కర్నూలు జిల్లా డిఆర్డిఏ పిడి రమణారెడ్డి మాట్లాడుతూ, మహిళలకు రుణాల వినియోగం, పొదుపు విధానాలు, ఆర్థిక స్వావలంబనపై వివరించారు. మహిళలకు ఏసీఎల్పీ రుణాల వివరాలు, రుణాల మంజూరు విధానం, తిరిగి చెల్లింపు పద్ధతులపై వివరణ ఇచ్చారు. మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పొదుపులో ఉన్నటువంటి మహిళలకు ఈ సంవత్సర కాలములో సభ్యుల జీవనోపాదుల మరియు ఇతర ఇంటి అవసరాల కొరకు తీసుకొనే రుణాల గూర్చ ఈ ప్రణాళిక తయారు చేయడం జరుగుతున్నది. అలాగే గ్రామములో నూతన జీవనోపాదుల కల్పన కొరకు సభ్యులకు అవగాహన కల్పించడం జరిగినది. అలాగే గ్రామములో ఉన్న పారిశ్రామిక వేత్తలతో పాటు కొత్తగా దాదాపు 45 మందిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చి దిద్దుటకు ప్రణాళిక లో పొందుపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్, డీఆర్డీఏ వెలుగుగ్రా రమణా రెడ్డి, డిపియం సిబిఓ ఫైనాన్స్ రహిమాన్, ఏపీఎం ఉన్నతి కరుణాకర్,నందవరం ఏపీఎం రాఘవేంద్ర, ఎల్ సి జనార్ధన్,సీసీలు చిన్నమ్మ మల్లేష్,వసుంధర, భీమేష్, శ్రీనిధి మేనేజర్ మాలతి, వివో ఏలు, దస్తగిరి,మంగమ్మ, మార్తమ్మ వెంకటరామిరెడ్డి, వివో ఓబీలు సీఆర్పీలు, పొదుపు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వీరపాపన కుంటలో!.. ఒకనెల ఒకగ్రామం,4గ్రామ సభలు

గ్రామసభలో సమస్యలు వెల్లువ!..
మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతులు!..
ప్రజలిచ్చిన ప్రతి అర్జీపరిష్కారం చేస్తాం!.. తహసీల్దార్ సరస్వతి!..
మండల అభివృద్ధి అధికారి(ఎం.పి.డి.ఓ)ఇమ్మానియల్!..





**వి.ఆర్.పురం,మే7(ప్రజాజ్యోతి ప్రతినిధి)** ఒకనెల-ఒక గ్రామం-నాలుగు పర్యటనలు,కార్యక్రమంలో భాగంగా,వీరపాపనకుంట, గ్రామంలో ప్రభుత్వం ఒకనెల, ఒక గ్రామం గ్రామసభ గ్రామస్తులు సమక్షంలో ఘనంగా నిర్వ హించామని, వరరామచంద్రాపురం, తహసీల్దార్ సరస్వతి, వరరామచంద్రాపురం, మండల అభివృద్ధి అధికారి ఎం.పీ. డీ. వో, ఇమ్మానుయేలు,స్పష్టంచేశారు. గురువారం, ఒకనెల- ఒకగ్రామం- నాలుగు పర్యటనల కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసం దర్భంగా వారు మాట్లాడుతూ , గ్రామసభలో నాలుగు దపాలుగా!గ్రామసభలు నిర్వహించి ప్రజాసమస్యలు పరిష్కారంచేసేందుకు ఈ గ్రామ సభ నిర్వహించడం జరుగుతుంద న్నారు.గ్రామసభలో గ్రామస్తులు అనేక సమస్యలు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారని, వివరించారు. ములక నపల్లి,నుండి వీరపాపన కుంట,గ్రామంవరకు రహదారి వీరపాప నుకుంట గ్రామంలో వాటర్ ట్యాంకు నిర్మాణము గ్రామంలో విద్యుత్ స్తంభా లువేసి, వీధి లైట్లు ఏర్పాటు, అంగన్వాడీ బిల్డింగు నిర్మాణం చేపట్టాలని, విజ్ఞప్తి చేశారని తెలిపారు. గిరిజనులు సాగు చేసుకుంటున్నా పోడు భూము లన్నిటికీ పట్టాలు ఇవ్వాలని గ్రామంలో మరమ్మ తులకు గురైన చేతిపంపులు బాగుచేసి సురక్షిత నీటిని విని యోగంలోకి తేవాలని,కోరారని వివరించారు. వృద్ధా ప్య,వి తంతు పెన్షన్లు, మంజూరు కొత్త కార్డులు మంజూరు చేయాలని గ్రామంలో అంతర్గత వీధిరోడ్లు నిర్మించాలని, పంటసాగుకు సంబంధించి చెరువు నిర్మాణం ఆయకట్టు స్థిరీకరణ జరిగేలా చూడాలని అధికారులను కోరారని చెప్పారు.వివిధ రెవెన్యూ సమస్యలను గ్రామ ములో గ్రామస్తులు, గ్రామసభలో తహసీల్దార్,కు విన్నవించారని, దీనిపై తహసీల్దార్, మూడు దుపాలుగా జరగ నున్న గ్రామ సభల తదుపరి ఇచ్చిన ప్రతి అర్జీని పరిష్క రించి, గిరిజనుల సమస్యలు, గ్రామసమస్యలు మౌలిక సదుపా యాలు,ఏర్పాటు కల్పిస్తామని, సూచించారు.వివిధ శాఖలలో వచ్చినటువంటి సమస్యలన్నీ ప్రభుత్వందృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని, పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో సర్పంచ్ సవలం మారయ్య, విద్యుత్ ఎల్.ఐ బాపూజీ,డి.ఆర్.ఓ కోడి రాజేశ్వరి, ఆర్. డబ్ల్యూ,ఎస్ జై సాయిరాం,వివిధ శాఖల అధికారులు సచివా లయ సిబ్బంది.రెవిన్యూ శాఖ సిబ్బంది. సిపిఎం జిల్లా నాయకులు సోయం చినబాబు,గ్రామ నాయకులు సోయం భద్రయ్య,తదితరులు గ్రామప్రజలు పాల్గొన్నారు.

# వీరపాపన కుంటలో!..ఒకనెల ఒకగ్రామం,4గ్రామ సభలు






గ్రామసభలో సమస్యలు వెల్లువ!..మౌలిక సదుపాయాలు కల్పించాలని
వినతులు!..ప్రజలిచ్చిన ప్రతి అర్జీపరిష్కారం చేస్తాం!.. తహసీల్దార్ సరస్వతి!..
మండల అభివృద్ధి అధికారి(ఎం.పి.డి.ఓ)ఇమ్మానియల్!..

వి.ఆర్.పురం,మే7(ప్రజాజ్యోతి ప్రతినిధి)ఒకనెల-ఒక గ్రామం-నాలుగు పర్యటనలు ,కార్యక్రమంలో భాగంగా, వీరపాపనకుంట, గ్రామంలో ప్రభుత్వం ఒకనెల, ఒక గ్రామం గ్రామసభ గ్రామస్తులు సమక్షంలో ఘనంగా నిర్వహించామని, వరరా మచంద్రాపురం ,తహసీల్దార్ సరస్వతి, వరరా మచంద్రాపురం, మండల అభివృద్ధి అధికారి ఎం.పీ.డీ.వో, ఇమ్మానుయేలు, స్పష్టంచేశారు. గురువారం, ఒకనెల-ఒకగ్రామం- నాలుగు పర్యటనల కార్యక్రమంలో ముఖ్యఅ తిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ గ్రామసభలో నాలుగు దపాలుగా!గ్రామసభలు నిర్వహించి ప్రజా సమస్యలు పరిష్కారంచేసేందుకు ఈ గ్రామ సభ నిర్వహిం చడం జరుగుతుంద న్నారు.గ్రామసభలో గ్రామస్తులు అనేక సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువ చ్చారని, వివరించారు. ములకనపల్లి, నుండి వీరపాపన కుంట, గ్రామంవరకు రహాదారి వీర పాపనుకుంట, గ్రామంలో వాటర్ ట్యాంకు నిర్మాణము గ్రామంలో విద్యుత్ స్తంభాలువేసి, వీధి లైట్లు ఏర్పాటు,అంగన్వాడీ బిల్డింగు నిర్మాణం చేపట్టాలని,విజ్ఞప్తి చేశారని తెలిపారు.గిరిజనులు సాగు చేసుకుంటున్నా పోడు భూములన్నిటికీ పట్టాలు ఇవ్వాలని,గ్రామంలోమరమ్మతులకు గురైన చేతిపంపులు బాగుచేసి సురక్షిత నీటిని వినియోగంలోకి తేవాలని,కోరారని వివరించారు. వృద్ధాప్య,వితంతు పెన్షన్లు, మంజూరు కొత్త కార్డులు మంజూరు చేయాలని గ్రామంలో అంతర్గత వీధిరోడ్లు నిర్మించాలని, పంటసాగుకు సంబంధించి చెరువు నిర్మాణం ఆయకట్టు స్థిరీకరణ జరిగేలా చూడాలని అధికారులను కోరారని చెప్పారు.వివిధ రెవెన్యూ సమస్యలను గ్రామములో గ్రామస్తులు,గ్రామసభలో తహసీల్దార్,కు విన్నవిం చారని, దీనిపై తహసీల్దార్, మూడు దుపాలుగా జరగనున్న గ్రామసభల తదుపరి ఇచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించి,గిరిజనుల సమస్యలు,గ్రామసమస్యలు మౌలిక సదుపాయాలు,ఏర్పాటు కల్పిస్తామని,సూచించారు.వివిధ శాఖలలో వచ్చినటువంటి సమ స్యలన్నీ ప్రభుత్వందృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సవలం మారయ్య ,విద్యుత్ ఎల్.ఐ బాపూజీ,డి.ఆర్.ఓ కోడి రాజేశ్వరి,ఆర్.డబ్ల్యూ,ఎస్ జై సాయిరాం,వివిధ శాఖల అధికారులు సచివాలయ సిబ్బంది. రెవిన్యూ శాఖసిబ్బంది. సిపిఎం జిల్లా నాయ కులు సోయం చినబాబు,గ్రామ నాయకులు సోయం భద్రయ్య, తదితరులు గ్రామప్రజలు పాల్గొన్నారు.

# ఆలూరు టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి నాయకత్వంలో శరవేగంగా అభివృద్ధి పనులు





**లిహోళగుంద - ఆలూరు రహదారికి మహర్దశ....!**

**హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు**

**హోళగుంద, మే 7, ప్రజా జ్యోతి న్యూస్ -** రాష్ట్రంలో ఏళ్ల తరబడి అధ్వానంగా ఉన్న గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో 'గుంతలు లేని రోడ్లు' ఉండాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పనులు పరుగులు పెడుతున్నాయి.ఇందులో భాగంగా ముఖ్యంగా హోళగుంద - ఆలూరు వయా ఎల్లార్తి ప్రధాన రహదారి మరమ్మత్తు పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి.ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎల్లార్తి దర్గాలకు నిత్యం తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు వస్తుంటారు. గతంలో ఈ రోడ్డు గుంతలమయంగా ఉండటంతో ప్రయాణికులు, వాహ నదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల పట్ల మండల ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఆలూరు ఇంచార్జి వైకుంఠం జ్యోతి ఆదేశాలు అందిన వెంటనే యుద్ధప్రతిపాదికన పనులు ప్రారంభం జరగడంతో ప్రజలు,ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తు న్నారు.రోడ్డు బాగుపడుతుండటంతో ప్రయాణ సమయం తగ్గడంతో పాటు ప్రమాదాల భయం కూడా తొల గిపోయిందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో కూడా మౌలిక సదుపాయాలు మెరుగు పడుతున్నా యని ప్రజలు కొనియాడుతున్నారు.ప్రత్యేక చొరవతో పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నా ఆలూరు టిడిపి ఇన్చార్జ్ వైకుంఠం జ్యోతి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వైకుంఠం శివప్రసాద్ లకు ప్రజలు,ప్రయాణికులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజల రెవెన్యూ సమస్యలను గ్రామ స్థాయిలోనే వేగవంతంగా పరిష్కరించేందుకు..

వన్ మంత్.. వన్ విలేజ్.. ఫోర్ విజిట్స్
కార్యక్రమం - జమ్మలమడుగు ఆర్డీఓ శిరీష



**దువ్వూరు,మే7 ( ప్రజా జ్యోతి )** గ్రామస్థాయి రెవెన్యూ సమస్యలకు,భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా "వన్ మంత్.. వన్ విలేజ్.. ఫోర్ విజిట్స్" కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు జమ్మలమడుగు ఆర్డీఓ శిరీష గురువారం మండల పరిధిలోని చల్ల బసాయపల్లె గ్రామ సచివాలయంలో రైతులకు,ప్రజలకు అవగాహనా సదస్సు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామస్థాయిలోనే భూవివాదాలను గుర్తించి, దశలవారీగా పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. ఈ విధానంలో భాగంగా ఒక గ్రామాన్ని ఎంపికచేసి ఒక నెలలో నాలుగు విడతలుగా అధికారులు గ్రామానికివెళ్లి ప్రజల భూసమస్యలను పరిశీలించి పరిష్కారం చూపడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు.భూ రికార్డులు, మ్యూటేషన్లు, సాదాబైనామా, డీకేటీ పట్టాలు, హౌస్ సైట్స్‌వంటి అంశాలపై వస్తున్న ఫిర్యాదులను సమగ్రంగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతోంది. కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవ రెడ్డి, ఎంపీడీఓ సుబ్బారెడ్డి,వీఆర్వో మహబూబ్ బాష, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు..



**కంబదూరు మే 7:(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు మండల పరిధిలోని రాళ్ల అనంతపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు దుబ్బ రామాంజనేయులు ఆహ్వానం మేరకు గురువారం రాళ్ల అనంతపురం గ్రామంలో ఆయన నూతనంగా నిర్మించుకున్న గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, హాజరై వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే సురేంద్రబాబు కు గ్రామస్తులు, టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాజీ జెడ్పీ విపక్ష నేత కరణం రామ్మోహన్ చౌదరి, మోరేపల్లి మల్లికార్జున, మాజీ సర్పంచ్ గాజుల శ్రీరాములు, దండ వెంకటేశులు, మండల కన్వీనర్ శివన్న, సింగల్ విండో అధ్యక్షులు పి బాబయ్య, తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## రేల ఉత్సవాలు జయప్రదం చేయండి.. గిరిజన హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి





**అల్లూరి విగ్రహానికి నివాళులు**

**అర్పించిన ప్రజాసంఘాల నాయకులు**

**కూనవరం, మే 7 (ప్రజా జ్యోతి):** ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ రేల ఉత్సవాలను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం కూనవరం మండలంలోని శ్రీమార్త శ్రీరామ్మూర్తి భవనంలో మేకల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ప్రజాసంఘాల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సమావేశానికి ముందు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా టేకులబోరులోని అల్లూరి విగ్రహానికి పొడియం రామారావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో గిరిజన సంఘ నాయకుడు బాబు బొర్రయ్య మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రాజెక్టులు, గనుల తవ్వకాలు పీసా చట్టం ప్రకారం గ్రామసభ అనుమతి లేకుండా చేపట్టకూడదని, కానీ ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం గిరిజన సంఘం నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కొమరం పెంటయ్య, పాయం సీతారామయ్య, తెల్లం తమ్మయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు, పాయం సత్యనారాయణ, నాగమణి, అమ్మాజీ, జయసుధ, రమేష్, రాములు, నారాయణ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## ఆప్షన్లు ఎన్నుకోండి!..

**ఆప్షన్ ఫారాలు సమర్పించండి!..**

**తహసీల్దార్ సరస్వతి!..**



**వి.ఆర్.పురరే 7(ప్రజాజ్యోతిప్రతినిధి)వరరా మచంద్రాపురం,** మండలంలోని, పోలవరం ముంపు, నిర్వాసితగ్రామాల్లో గిరిజనేతర కుటుంబాలు, పి.డి.ఎఫ్,వారిగా ఆర్ఉఆర్, కాలనీలనందు గృహనిర్మాణం చేపట్టుటకు తమ యొక్క ఆప్షన్లు ఫారంలు 1,2,ఉ3 సమర్పించుటకుచివరి తేది .28. 05.26 కావు నగిరిజనేతర కుటుంబాల వారు త్వరితగతిన తమ ఆప్షన్ ఫారంలు సమర్పించ వలసినదిగా తహసీల్దార్ సరస్వతి కోరడం జరిగిందని తెలిపారు.

# సూర్యలంకలో ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం

**పర్యాటకుల కోసం పరిశుభ్రతకు పెద్దపీట.. నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు**

**బాపట్ల మే 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన సూర్యలంక బీచ్‌ను పరిశుభ్రంగా, పర్యావరణ హితంగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సూర్యలంక బీచ్ మరియు అడవి గ్రామపంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్లు అడవి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి, డిప్యూటీ ఎంపీడీవో జి. రామకృష్ణ తెలిపారు.ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక కరపత్రాలను ముద్రించి అడవి గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని వాణిజ్య సముదాయాలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే రామ్‌నగర్ నుంచి సూర్యలంక బీచ్ వరకు పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధంపై చైతన్యం కలిగించే ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.సూర్యలంక బీచ్‌లో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నలుగురు స్వీపర్లు, అనంతరం బీచ్ మూసివేసే వరకు మరో నలుగురు స్వీపర్లు పరిశుభ్రత పనుల్లో నిమగ్నమవుతున్నారని తెలిపారు. అదేవిధంగా ఒక పవర్ ఆటో మరియు డ్రైవర్ నిరంతరం చెత్త తరలింపు పనుల్లో పాల్గొంటున్నారని చెప్పారు.నగరవనం సమీపంలో విశ్రాంతి తీసుకునే పర్యాటకులు ఆహార వ్యర్థాలను తప్పనిసరిగా డస్ట్‌బిన్‌లలో మాత్రమే వేయాలని సూచించారు. ప్లాస్టిక్ విక్రయించిన వారికి రూ.10 వేల జరిమానా, ప్లాస్టిక్ వినియోగించిన పర్యాటకులకు రూ.2 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ విషయాన్ని కరపత్రాలు, మైక్ ప్రచారం ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నట్లు తెలిపారు. సూర్యలంక బీచ్‌కు వచ్చే ప్రతి పర్యాటకుడు పరిశుభ్రతకు సహకరించాలని గ్రామపంచాయతీ అధికారులు విజ్ఞప్తి చేశారు.




ఎంపీడీవో బాబురావు, డిడిఓ విజయలక్ష్మి ప్రతిరోజూ బీచ్ పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు.

# జీలుగుమిల్లిలో ఘనంగా దామోదరం సంజీవయ్య వర్ధంతి

**(జీలుగుమిల్లి /ప్రజాజ్యోతి)** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, నిరుపేదల పెన్నిధి దామోదరం సంజీవయ్య వర్ధంతి వేడుకలు మండల కేంద్రమైన జీలుగుమిల్లిలో గురువారం ఘనంగా నిర్వహించబడ్డాయి. దాసరి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

**సంజీవయ్య స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి**

ఈ సందర్భంగా సంఘం నాయకులు నేలటూరి సత్య మాస్టర్ మాట్లాడుతూ సంజీవయ్య జీవితం అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా, పార్లమెంటేరియన్ గా, ఏఐసీసీ అధ్యక్షుడిగా ఆయన దేశానికి మరువలేని సేవలు అందించారని గుర్తుచేశారు. నేటి యువత సంజీవయ్యను స్ఫూర్తిగా తీసుకుని, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన పిలుపునిచ్చారు.

**ప్రభుత్వానికి విన్నపం**

అర్చకత్వమే ప్రధాన ఉపాధిగా జీవిస్తున్న మాల దాసర్ల సమస్యలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖలో మాల దాసర్లకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కల్పించి, వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాసులంతా ఐక్యమత్యంగా ఉండి అన్ని రంగాల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దాసరి సంక్షేమ సంఘం



సభ్యులు. గడ్డం రామదాసు జెట్టి రామకృష్ణ ఉర్ల బాబి కిరణ్, కోరం చెన్నకేశవ బట్టు సందీప్, రాకేష్ పాలకొండ నరసింహ, బంటి, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎండాకాలంలో.. ఆరోగ్యం విస్మరిస్తే ఆసుపత్రిపాలే

**గుంతకల్లు మే 7 (ప్రజా జ్యోతి):** రోజురోజుకు భానుడు ఉగ్రరూపం దాలుస్తూండటంతో ఉష్ణోగ్రత లు పెరుగుతుండడంతో మండే ఎండలు నుంచి ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని జాగ్రత్తలను విస్మరిస్తే ఆసుపత్రిపాలు అవుతారని నాగసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్ నవీన్ బాబు గ్రామ ప్రజలకు తెలిపారు. గురువారం నాగసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్ నవీన్ బాబు మరియు దోసలుడికి సచివాలయ ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో దోసలోడికి గ్రామంలో గర్భవతులు, వృద్ధులు మరియు పిల్లలకూ ఎండ కాలం లో తీసుకోవా ల్సిన జాగ్రత్తలు మరియు చేయకూడని పనులు గురించి క్రింది విధంగా వివరించడం జరిగింది. వడదెబ్బ లక్షణాలు తలనొప్పి, తల తిరగడం, తీవ్రమైన జర్వం కలిగియుండటం, మత్తునిద్ర, ఫిట్స్, పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితి. ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు నెత్తికి టోపి పెట్టుకోండి లేదా రూమాలు కట్టుకోండి, తెలుపురంగు గల కాటన్ వస్త్రాలను ధరించండి. అదేవిధంగా మీ కళ్ళ రక్షణ కోసం సన్ గ్లాసెస్ ఉపయోగించండి. వీలైనంత వరకు ఇంట్లో ఉండటానికి ప్రయత్నించండి. దాహం వేయకపోయిన తరుచుగా నీటిని తాగండి. ఉప్పుకలిపిన మజ్జిగ, గ్లూకోజు, ఓ ఆర్ యస్ కలిపిన నీటిని తాగవచ్చును. వడదెబ్బకు గురైన వారు సాధారణ స్థితికి రానిచో, దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించండి. ఎండలో నుంచి వచ్చిన వెంటనే నీరు గాని , నిమ్మరసముగాని, కొబ్బరి నీరు గాని తాగాలి. తీవ్రమైన ఎండలో బయటికి వెళ్ళినప్పు డు తలతిరుగుట, వాంతులు ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే వెంటనే దగ్గరలోని వైద్యుణ్ణి సంప్రదించండి. ఇంటి వాతావరణం చల్లగా ఉంచుకోండి. ఫ్యాను వాడండి. చల్లని నీరుతో స్నానం చేయండి. తక్కువ ఖర్చుతో కూడిన చల్లదనం కోసం ఇంటిపై వైట్ పెయింట్, కూల్ రూఫ్ టెక్నాలజీ, క్రాస్ వెంటిలేషన్, థర్మోకోల్ ఇన్సులేషన్ ను ఉ పయో గించండి. మేడపైన మొక్కలు, ఇంట్లో ని మొక్కలు (ఇండోర్ ప్లాంట్స్) భవనాన్ని చల్లగాఉంచుతాయి. అదేవిదంగా ఉష్ణతాపా న్ని తగ్గిస్తాయి. ఎండ తీవ్రతంగా ఉన్నప్పుడు చేయకూడనివి ఎండలో గొడుగు లేకుండా తిరగరాదు. వేసవి కాలంలో నలుపు రంగు, మందంగా ఉండే దుస్తులు ధరించరాదు. గుండె సంబ ంధిత వ్యాదులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదు. మధ్యాహ్నం తరువాత (మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 3గంటల మధ్యకాలంలో) బయట ఎక్కువ శారీరక శ్రమతో కూడిన పనిచేయ రాదు. బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు బయట తిరగరాదు. వీరిపై ఎండ ప్రభావం త్వరగా చూపే అవకాశం ఉంది. శరీరాన్ని డీహైడ్రేట్ చేసే ఆల్కహాల్, టీ, కాఫీ మరియు కార్బోనేటేడ్ శీతల పానీయాలు మాను కోండి. అధిక ప్రోటీన్, ఉప్పు, కారం, నూనె ఉండే పదార్ధా లను తీసుకోవద్దు.



ప్రకాశించే లైట్ బల్బులను వాడటం మానుకోండి, అవి అనవస రమైన వేడిని విడుదల చేస్తాయి. ఎండలో నుంచి వచ్చిన వెంటనే తేనె వంటి తీపిపదార్ధములు తీసుకొన కూడదు. రంగురంగుల శీతలపానీయములు మరియు ఐస్ వంటివి తీసుకుంటే అనారోగ్యము ఏర్పడుతుంది. ఎండ ఎక్కువగా వున్న సమయంలో వంట చేయకుండా ఉండండి. వంట గది తలుపులు మరి యు కిటికీలను తీసివుంచి తగినంత గాలి వచ్చేవిదంగా చూసుకోండి. వడ దెబ్బకు గురైన వారిని వేడి నీటిలో ముంచిన గుడ్డతో తుడువ రాదు. దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేర్చుటలో ఏ మాత్రం ఆలస్యం చేయరా దు అని డాక్టర్ నవీన్ బాబు తెలిపారు.

## ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ బంద నలపై అవగాహన కల్పిస్తున్న బద్వేల్ రూరల్ ఎస్సై రంగారావు



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ మే 7 (ప్రజాజ్యోతి)**బద్వేల్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పి.పి కుంట చెక్‌పోస్ట్ వద్ద పై అధికారుల ఆదేశాల మేరకు గురువారం నాడు ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రంగారావు మాట్లాడుతూ వాహనాలను నడిపే ఆటో డ్రైవర్లు మద్యం సేవించి, సెల్ ఫోన్ తో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, ప్రతి వాహనాలకు రికార్డులు సక్రమంగా ఉండాలని, ఇన్సూరెన్స్ విధిగా చేయించాలని, ఆటో లలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, ఆటో డ్రైవర్స్ యూనిఫారం ధరించాలని ,తదితర అంశాలపై డ్రైవర్స్ కు ఎస్సై రంగారావు అవగాహన కల్పించారు.

## డీజేలకు అనుమతి లేదు

**ఎస్ఐ ఈశ్వరరావు**

**హాలహర్వి మండలం ప్రజా జ్యోతి న్యూస్ మే 07:-**

హాలహర్వి మండలంలో డీజే సౌండ్ సిస్టం లకు అనుమతి లేదని హాలహర్వి ఎస్ ఐ ఈశ్వరరావు తెలిపారు. గురువారం ఎస్ఐ ఈశ్వరరావు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజా శాంతి భద్రతలు, గ్రామంలో వృద్ధులు, చిన్నారులు, ఆరోగ్యాన్ని దృష్టి లో ఉంచుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీజే లు , సౌండ్ సిస్టం అనుమతులు లేవు అని పేర్కొన్నారు. అధిక శబ్దం కారణంగా ప్రజలకు అసౌకర్యం కలగడం ,రోడ్డు ప్రమాదాలకు అవకాశాలు ఉండడం వల్ల ఈ నిర్ణయం తీసుకోబడింది అని తెలిపారు.చట్టవ్యవస్థకు భంగం కలిగే అవకాశాలు ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని తెలియజేశారు. నిబంధనలు అతిక్రమించి డిజే సౌండ్ సిస్టం ఏర్పాటు చేస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## డిజిటల్ విధానంలో ఇంటింట గణన పూర్తి చేయాలి

సెన్సస్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్డీవో గ్లోరియ సూచన



**బాపట్ల మే 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణన కార్యక్రమంలో భాగంగా ఇంటింటి వివరాల సేకరణను వేగవంతంగా, ఖచ్చితంగా పూర్తి చేయాలని ఆర్డీవో గ్లోరియ సూచించారు. సెన్సస్ కార్యక్రమంలో భాగంగా ఆమె నివాసం ఉంటున్న ఆచంట రంగనాయకులు నగర్‌లోని తన ఇంటి వివరాలను ఎన్యూమరేటర్ రాజకుమారికి అందించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంబంధించిన సమాచారాన్ని డిజిటల్ విధానంలో నమోదు చేయడం ద్వారా ప్రభుత్వానికి సమగ్ర సమాచారం అందుతుందని తెలిపారు.జనాభా, కుటుంబ సభ్యుల వివరాలు, నివాస పరిస్థితులు తదితర అంశాలను ఎటువంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. ప్రజలు కూడా సెన్సస్ సిబ్బందికి సహకరించి సరైన వివరాలు అందించాలని కోరారు.సమగ్ర గణాంకాల ఆధారంగానే ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పన, అభివృద్ధి కార్యక్రమాల అమలు మరింత సమర్థవంతంగా జరుగుతాయని ఆర్డీవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్ రాజకుమారి పాల్గొన్నారు.

## 34 గ్రామపంచాయతిలకు పారిశుద్ధ్య వాహనాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఎంజీఆర్.



**ప్రజాజ్యోతిరిపోర్టర్ :- యం. నరేష్.** పాతపట్నం మండల కేంద్రంలో పారిశుద్ధ్య వాహనాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఎంజీఆర్ చెత్త సేకరణకు సరికొత్త ఊతం -- రిక్షాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఎంజీఆర్ గ్రామాల్లో పారిశుద్ధ్య మెరుగుదలే లక్ష్యం: 34 గ్రామ పంచాయతీలకు పారిశుద్ధ్య వాహనాలు పాతపట్నం మండల కేంద్రంలో గల పంచాయతీ కార్యాలయం ఆవరణలో 34 గ్రామపంచాయతీలకు పారిశుద్ధ్య వాహనాలను పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు పంపిణీ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు కీలక అడుగు పడిందని పేర్కొన్నారు.గ్రామ పంచాయతీలలో ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి తడి చెత్త మరియు పొడి చెత్తను వేరువేరుగా సేకరించే నిమిత్తం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు చక్రాల రిక్షాలను సరఫరా చేసింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడటం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా చెత్తను వేరు చేసి ఈ వాహనాల ద్వారా పంపాలని, తద్వారా మన గ్రామాలూ, మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 'స్వర్ణ ఆంధ్ర'గా మారుతుందని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మండల మరియు పంచాయతీ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన గుంతకల్ మండల ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి



**గుంతకల్లు మే 7 (ప్రజా జ్యోతి):** మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ జగన్నాథ్ వివాహం ఆహ్వానం మేరకు గ్రామంలో జరుగుతు న్న శుభకార్యానికి ముఖ్యఅతిథిగా గుంతకల్లు మండల ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి పాల్గొని నూతన వధూవరులు లావణ్య -- జగన్నాథ్ లను ఆశీర్వదిం చడం జరిగింది.

## కొమ్ముచిక్కాలలో పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ.




**పాలకొల్లు. ప్రజాజ్యోతి ప్రతినిధి కొట్టి రామం. మే 7.** పోడూరు మండలం కొమ్ముచిక్కాల లో ప్రభుత్వ రాజముద్రతో తయారైన కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను గురువారం స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు రైతులకు పంపిణీ చేశారు. 990 ఖాతాలకు గాను 748 కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందని తహసీల్దార్ సయ్యద్ మౌలానా పాజిల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు కూటమి నాయకులు ప్రజాప్రతినిధులు రైతులు, గ్రామ రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు..

# నిర్వాసితుల 'కష్టం' నాకు తెలుసు..
# న్యాయం జరిగే వరకు మీ వెంటే ఉంటా

ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి భరోసా

గన్నవరంలో అట్టహాసంగా టీడీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం

**ఎటపాక, మే 07 (ప్రజాజ్యోతి):** పోలవరం ప్రాజెక్టు కోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన నిర్వాసితుల పక్షాన ప్రభుత్వం అండగా నిలుస్తుందని, వారి సమస్యలను నేరుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రంపచోడవరం శాసనసభ్యురాలు మిరియాల శిరీష దేవి స్పష్టం చేశారు. గురువారం ఎటపాక మండలం గన్నవరం గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా పుల్లయ్య అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశానికి ముందు ఎమ్మెల్యే గన్నవరంలోని ప్రసిద్ధ కాళికార్తికేయ శివాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ .. పోలవరం నిర్వాసితుల త్యాగఫలితమే నేటి పోలవరం జిల్లా ఆవిర్భావమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఒకే నియోజకవర్గంతో జిల్లాను ఏర్పాటు చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని ఆమె హర్షం వ్యక్తం చేశారు. ముంపు బాధితుల భవిష్యత్తుపై ఎమ్మెల్యే కీలక హామీలు ఇచ్చారు. ఎటపాక మండలంలో ముంపుకు గురయ్యే ప్రతి ఎకరా భూమికి, ప్రతి ఇంటికి న్యాయబద్ధమైన నష్టపరిహారం. సెకండ్ ఫేజ్ కాంటూరు బాధితులకు కూడా ఎటువంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. నిర్వాసితులందరికీ పునరావాసం పూర్తయ్యే వరకు ప్రాజెక్టు పనులపై పూర్తి దృష్టి ఉండదని స్పష్టం చేశారు.టీడీపీ






అబ్జర్వర్ కొల్లిబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి ప్రాణవాయువు అని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం కాపుగొంపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కాపుల వెంకటేశ్వర్లు అనారోగ్యంతో ఉన్నారని తెలుసుకుని ఎమ్మెల్యే స్వయంగా ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం సహకరిస్తామని హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, మువ్వా శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ మాచినేని రాజేష్, భగవత్ కుమారి,పాటి చలపతిరావు, నాలజల శ్రీకాంత్, పాటి సంపత్, వల్లభనేని చందు, సూర్యనారాయణ చౌదరి, కణితి మధు, రూపా లక్ష్మి, బాచినేని మల్లేశ్వరరావు, పెనుబల్లి సాయిబాబు ,సురేష్ గౌడ్, పాయం దేవి తదితర వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలవరంలో ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌కు ఘన సత్కారం

**(పోలవరం ప్రతినిధి ప్రజాజ్యోతి)** ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ యాదవ్ గురువారం పోలవరం మండలంలో పర్యటించారు. ఏపీ ట్రైకర్ చైర్మన్ బోరగం శ్రీనివాసులు మేనల్లుడి వివాహ శుభకార్యానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు. జగదీశ్వరి ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు మరియు పర్యావరణ హితంగా ఒక పూల మొక్కను బహూకరించారు.

**అభివృద్ధిపై చర్చ:**
మర్యాదపూర్వక భేటీ అనంతరం, నియోజకవర్గ అభివృద్ధి పనులు మరియు ప్రజా సంక్షేమ పథకాల అమలుపై ఇరువురు నేతలు క్లుప్తంగా చర్చించుకున్నట్లు సమాచారం.

**ప్రజలతో మమేకం:**
వివాహ వేడుకకు విచ్చేసిన ఎంపీ మహేష్ యాదవ్, అక్కడ ఉన్న స్థానిక ప్రజలు మరియు కార్యకర్తలతో ఎంతో ఆత్మీయంగా మాట్లాడారు.

**ఘన స్వాగతం:**
ఎంపీ రాకతో వివాహ వేడుకలో సందడి నెలకొంది. టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

?ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు. వివాహ వేడుక అత్యంత ఆనందోత్సాహాల మధ్య వైభవంగా జరిగింది.



## టీడీపీ తెలుగు యువత నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్న చాగలమర్రి వాసులు.........



**చాగలమర్రి , మే 07( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** నంద్యాల జిల్లా మండల కేంద్రమైన చాగలమర్రిలో టీడీపీ యువత నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ జన్మదిన వేడుకలు టిడిపి కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు.పార్లమెంట్ బిసి సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు మాట్లాడుతూ రాజకీయం ఎంతో బాధ్యతయుతంగా వ్యవహరిస్తున్నారని కొని యాడా . రానున్న రోజుల్లో అధిష్టానం నుంచి కీలక పదవి సంపాదించి ప్రజల మన్ననలను పొందాలని చాగలమర్రి ప్రజలు కోరారు.ఈ కార్యక్రమంలో పార్లమెంట్ బిసి సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు , టి ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, చాగలమర్రి పట్టణ ఉపాధ్యక్షుడు కామిశెట్టి రమేష్ , దూదేకుల సంఘం అధ్యక్షుడు టైలర్ భాష , ఎస్సి సెల్ ఉపాధ్యక్షుడు కశినేని ఓబులేసు , పార్టీ శ్రేణులు , పార్టీ అభిమానులు , తదితరులు పాల్గొన్నారు.

# నేను కాదు... మనం తోనే అభివృద్ధి సాధ్యం

సింగపూర్ తరహా విధానాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్దాం : సీఎం చంద్రబాబు




**బాపట్ల మే 07 ( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** టీమ్‌వర్క్, సమిష్టి కృషితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నేను అనే భావనకు బదులుగా మనం అనే ఆలోచన విధానం ప్రతి అధికారిలో, ప్రజాప్రతినిధిలో రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఇకపై తాను కూడా నేను అనే పదం కాకుండా మనం అనే పదాన్నే ఎక్కువగా ఉపయోగిస్తానని వెల్లడించారు.గురువారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన 7వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో సీఎం పలు కీలక అంశాలపై సమీక్ష నిర్వహించారు. జీఎస్డీపీ వృద్ధి, జిల్లాల వారీ అభివృద్ధి, సింగపూర్ పాలనా విధానాలు, టూరిజం అభివృద్ధి, ఫీల్డ్ స్థాయి అధికారుల పాత్ర వంటి అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ నేర్చుకోవడం నిరంతర ప్రక్రియ అని, ప్రపంచంలో ఎక్కడ ఉత్తమ విధానాలు ఉన్నా వాటిని అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. సింగపూర్‌లో అమలవుతున్న సమర్థ పాలన ప్రజల విశ్వాసాన్ని సంపాదించిందని, అక్కడి ఉత్తమ విధానాలను తీసుకుని రాష్ట్రంలోని ఒక జిల్లాను మోడల్‌గా అభివృద్ధి చేయాలని సూచించారు. ఇందుకోసం 90 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.ఫీల్డ్ స్థాయి అధికారుల అనుభవాన్ని సమర్థంగా వినియోగించుకుంటే అభివృద్ధి వేగవంతం అవుతుందని సీఎం పేర్కొన్నారు. క్షేత్రస్థాయి ఉద్యోగుల వద్ద ప్రజల సమస్యలు, స్థానిక అవసరాలపై విస్తృత సమాచారం ఉంటుందని, వారి సూచనలను పాలనలో భాగం చేయాలని అన్నారు.టూరిజం రంగం అభివృద్ధి చెందిన జిల్లాలకు అధిక ఆదాయం వస్తోందని సీఎం తెలిపారు. సూర్యలంక, మంగినపూడి, విశాఖ, శ్రీకాకుళం, మైపాడు వంటి బీచ్ ప్రాంతాలను అభివృద్ధి చేస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. కొత్త జాతీయ రహదారులు, లాజిస్టిక్స్ హబ్‌లు, టౌన్‌షిప్‌ల అభివృద్ధితో జిల్లాల ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని పేర్కొన్నారు.అన్నమయ్య జిల్లా కలెక్టర్ వినూత్న ఆలోచనలతో మంచి ఫలితాలు సాధించారని ఉదాహరణగా పేర్కొంటూ, ప్రతి జిల్లా కలెక్టర్ ఉత్తమ విధానాల అమలులో పోటీ పడాలని సీఎం సూచించారు. జిల్లాల మధ్య అభివృద్ధి పోటీ పెరిగితే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు.ఈ కలెక్టర్ల సమావేశంలో బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ పాల్గొని జిల్లా అభివృద్ధి, టూరిజం, జీఎస్డీపీ వృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చించారు.

## తిరుగుడుమెట్టలో వన్ మంత్ వన్ విలేజ్ కార్యక్రమం

**తాళ్లపూడి, మే 7, ప్రజాజ్యోతి న్యూస్** భూ యజమానులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి ప్రజల ముంగిటికే రెవెన్యూ సేవలు అందించాలనే ఉద్దేశంతో రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యచరణను రూపొందించింది నెలలో ఒక గ్రామాన్ని నాలుగు దఫాలుగా గ్రామ సందర్శన పేరుతో కార్యక్రమాన్ని చేపట్టింది దీనిలో భాగంగా గురువారంతాళ్లపూడి మండలం తిరుగుడు మెట్ట గ్రామంలో



తహసిల్దార్ లక్ష్మీ లావణ్య అధ్యక్షతన గ్రామ సభను నిర్వహించారు. గ్రామంలోని పలువురు రైతులు భూమి వ్యత్యాశములు సరిచేయాలని దరఖాస్తు చేసినట్లు తాసిల్దార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సత్యనారాయణ, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు

## జనగణనసర్వేకు ప్రజలు సహకరించాలి.

సర్వేపై ఉన్న అపోహలు విడనాడాలి.

అనంతగిరి మండల రెవెన్యూ అధికారి వీరభద్రాచారి విజ్ఞప్తి.



**అనంతగిరి మండలం. మే 7.** ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్. అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం 24.గ్రామ పంచాయతీల పరిధి గిరిజన గ్రామాల్లో మే ఒకటవ తేదీ నుండి జరుగుతున్న జనగణన సర్వేకు 17.మంది సూపర్వైజర్లు 90. మంది ఎనిమినేటర్లు నియమించడం జరిగిందని అనంతగిరి మండల రెవెన్యూ అధికారి వీరభద్రాచారి గురువారం నాడు ఎమ్మార్వో కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి సర్వే యొక్క వివరాలను తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సర్వేకు మండల ప్రజలు సహకరించాలని సర్వే వల్ల ఎటువంటి నష్టం జరగదని ప్రతి గిరిజన కుటుంబం. కుటుంబం యొక్క మొత్తం వివరాలు ఇనిమినేటర్ల సిబ్బందికి అందించి సహకరించాలని ఎమ్మార్వో కోరారు. వ్యక్తిగతంగా వాహనాలు. ఆస్తులు.విలువైన సంపద ఉంటే ఈ సర్వే వల్ల అన్నీ కోల్పోతామనే అపోహ ప్రజల్లో ఉందని అటువంటిది ఏమీ జరగదని అపోహలు విడనాడాలనే ఉద్దేశంతోనే పత్రికా సమావేశం ఏర్పాటు చేసి పత్రికల ద్వారా వాస్తవాలను తెలియజేయడం జరుగుతుందని ఎమ్మార్వో స్పష్టం చేశారు. ఈ విషయం ప్రజలు తప్పక గమనించి సర్వే బృందానికి సహకరించాలని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సర్వే కార్యక్రమం మే 30.వ తేదీ వరకు కొనసాగుతుందని సర్వేపై ఎటువంటి సందేశాలు కలిగిన నేరుగా తననుసంప్రదించవచ్చుననిఅన్నారు.

## రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేసిన తహాశీల్దార్ లక్ష్మీరాజు



**హొళగుంద, మే 7, ప్రజా జ్యోతి న్యూస్: -** మండల కేంద్రంలోని పలు రేషన్ షాపులను తహాశీల్దార్ లక్ష్మీరాజు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని షాప్ నెంబర్ 1324002,1324004 మరియు 1324035 లను సందర్శించిన తహాశీల్దార్, అక్కడ స్టాక్ రిజిస్టర్లను, నిల్వ ఉన్న సరుకులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్డుదారులకు ప్రభుత్వం నిర్ణయించిన పరిమాణంలో నాణ్యమైన బియ్యం మరియు ఇతర నిత్యావసర సరుకులను నిర్ణీత సమయంలోగా పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించారు.తూకంలో తేడాలు వచ్చినా, పంపిణీలో అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రేషన్ షాపుల పనితీరుపై ప్రజలు సంతృప్తిగా ఉండాలని,ఎటువంటి ఫిర్యాదులకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని ఆయా రేషన్ షాపుల డీలర్లకు సూచించారు.ఈ తనిఖీల్లో వి ఆర్ ఓ ప్రహ్లాద,సిబ్బంది నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

## మే 9న బద్వేల్ లో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

**బద్వేల్ స్టాప్ రిపోర్టర్ మే 7 (ప్రజా జ్యోతి)** బద్వేలు లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మే 9వ తేదీ ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బద్వేలు సుమిత్రానగర్ కు చెందిన ఉపాధ్యాయుడు వీరదాసరి జేకబ్ సెల్వరాజ్ తెలియజేశారు. నెల్లూరు పట్టణం బృందావనం కు చెందిన సుశీల నేత్రాలయ వారిచే 9వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్.పి.సుధాకర్ రాజు, డాక్టర్.వి.జవహర్ సత్య బాబు, డాక్టర్.మేఘన లు పాల్గొని ప్రజలకు ఉచిత కంటి వైద్య సంబంధిత పరీక్షలు నిర్వహిస్తారన్నారు. గ్లాకోమా, శుక్లం, రెటీనా తదితర కంటి వ్యాధులకు పరీక్షలు చేసి తగిన వైద్య సలహాలు అందిస్తారన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ, క్యాస్ లెస్ (ఈహెచ్ఎస్) ద్వారా నెల్లూరులోని సుశీల నేత్రాలయ ఆసుపత్రి నందు ఉచితంగా ఆపరేషన్లు కూడా నిర్వహిస్తారన్నారు. ఆపరేషన్ అవసరమైన వారిని క్యాంపు రోజునే ఆసుపత్రికి తీసుకువెళ్లే ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు కూడా పంపిణీ చేస్తారన్నారు. ఈ కంటి పరీక్షలకు హాజరయ్యేవారు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ మరియు ఈహెచ్ఎస్ కార్డులను తీసుకొని రావాలన్నారు. బద్వేల్ లో జరిగే ఈ అవకాశాన్ని ప్రజలు, ఉద్యోగ, ఉపాధ్యాయులు పెన్షనర్లు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## ఎల్లార్తి దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు..



**హొళగుంద, మే 7, ప్రజా జ్యోతి న్యూస్ -** మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామంలో ప్రసిద్ధిగాంచిన ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలలో గురువారం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండే కాక కర్ణాటక,తెలంగాణ,మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్గాలను దర్శించుకుని ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు.దర్గాకు వచ్చిన భక్తులకు నిత్యాన్నదాన కార్యక్రమంలో భాగంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.అదేవిధంగా గురువారం సందర్భంగా మండల కేంద్రంలోని సాయిబన్న దర్గా,సాయిబాబా ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# పోలవరం నిర్వాసితులకు వరం.. పరిహారం భారీగా పెంపు

## కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం

## కూనవరం టీడీపీ అధ్యక్షులు ఎడవల్లి భాస్కరరావు కృషి ఫలించింది





**కూనవరం, మే 07 (ప్రజాజ్యోతి):** పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ కూటమి ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. నిర్వాసితుల కష్టాలను గుర్తించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిహారం మొత్తాన్ని గణనీయంగా పెంచుతూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విజయం వెనుక కూనవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎడవల్లి భాస్కరరావు మరియు ఇతర నేతల నిరంతర పోరాటం, అధికారులతో జరిపిన సంప్రదింపులు ప్రధాన భూమిక పోషించాయి.ప్రభుత్వం విడుదల చేసిన తాజా జీవో ప్రకారం నిర్వాసితులకు అందే ప్రయోజనాలు.ఇంటి స్థలం గతంలో ఉన్న రూ.1 లక్షను రూ.2 లక్షలకు పెంపు, సొంత ఇంటి నిర్మాణం రూ.2.85 లక్షల నుంచి రూ.3.57 లక్షలకు పెంపు, వన్ టైం సెటిల్మెంట్ కోరుకునే నిర్వాసితులకు రూ.6.85 లక్షలు చెల్లింపులు జరగనున్నాయి. నిర్వాసితుల సమస్యలపై ఎడవల్లి భాస్కరరావు నేతృత్వంలోని బృందం మొదటి నుంచే చిత్తశుద్ధితో పనిచేసింది. జీవో కాపీలతో ఆర్ అండ్ ఆర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శుభం నక్వాల్, స్పెషల్ కలెక్టర్ అభిషేక్‌లతో పలుమార్లు చర్చలు జరిపారు. అనంతరం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లి,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడి నిర్వాసితుల బాధలను వివరించారు. భాస్కరరావు చొరవతో ప్రభుత్వం కదిలి, మంత్రివర్గ ఆమోదం అనంతరం త్వరితగతిన జీవో విడుదల అయ్యేలా చర్యలు తీసుకుంది.ఈ సందర్భంగా కూనవరం మండల అధ్యక్షుడు ఎడవల్లి భాస్కరరావు మాట్లాడుతూ, ఇది నిర్వాసితుల విజయమని కొనియాడారు. "ఒక రాజకీయ పార్టీగా పనిచేయడమంటే కేవలం విమర్శలు చేయడం కాదు. క్షేత్రస్థాయిలో నిర్వాసితులకు నిజమైన ప్రయోజనం చేకూర్చడం ముఖ్యం. గత ఐదేళ్లుగా నిలిచిపోయిన ఆర్ అండ్ ఆర్ ప్రక్రియను కూటమి ప్రభుత్వం పట్టాలెక్కించింది. అధికారులకు నిర్వాసితులు సహకరిస్తే త్వరలోనే అందరికీ పూర్తిస్థాయిలో పరిహారం అందుతుంది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పొడియం అప్పారావు, పారి సోమయ్య తదితర నేతలు పాల్గొని పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంపై కూనవరం మండల నిర్వాసితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ద్వారకాతిరుమలలో రూ. 29 కోట్లతో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

**ముఖ్య అతిథిగా రానున్న రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**

**ఏర్పాట్లను వివరించిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి, గడ్డమణుగు రవికుమార్**

**(పోలవరం ప్రతినిధి ప్రజాజ్యోతి)** ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 9వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు పలు కీలక అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం జరగనుంది. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఈ పనులను ప్రారంభించనున్నట్లు ఆలయ ట్రస్టు ప్రత్యేక ఆహ్వానితులు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి, మాజీ జెడ్పిటిసి గడ్డమణుగు రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

**ప్రారంభం కానున్న ప్రధాన పనులు:**

సుమారు 29 కోట్ల రూపాయల వ్యయంతో భక్తుల సౌకర్యార్థం నిర్మించిన కట్టడాలను మంత్రి జాతికి అంకితం చేయనున్నారు. అన్నదాన మండపం (ఫేజ్-2): రూ. 12 కోట్లు భక్తుల క్యూ కాంప్లెక్స్ - రూ. 12.50 కోట్లు శివాలయం ఐదు అంతస్తుల రాజగోపురం- రూ. 4.50 కోట్లు ఈ కార్యక్రమానికి హాజరుకానున్న నాయకులు, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అధ్యక్షత వహించనున్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారథి, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జడ్పీ చైర్మన్ గంట పద్మశ్రీ హాజరుకానున్నారు. గౌరవ అతిథులుగా ఎండోమెంట్ ఎక్స్ అఫీషియో కార్యదర్శి ఎం. హరి జవహర్లాల్, కమిషనర్ కె. రామచంద్ర మోహన్, ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి పాల్గొంటారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ కుమార్, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఆలయ ధర్మకర్త మండలి అధ్యక్షులు ఎస్. సుధాకర్ రావు, అనువంశిక ధర్మకర్త ఎస్. నివృత్ రావులతో పాటు కమిటీ సభ్యులు, ఆలయ అధికారులు, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని రవికుమార్ వివరించారు.

?భక్తుల సౌకర్యార్థం దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా ఈ పనులు ఎంతగానో దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



# ఉరుసు వేడుకల్లో భక్తుల సందడి.. పోలీసుల అప్రమత్తత

సి ఐ భాస్కర్ రెడ్డి

ఎస్ ఐ శ్యామ్ సుందర్ రెడ్డి

సయ్యద్ షాలేం పీర్ ఖాద్రి వారి ఉరుసు

గంధం కార్యక్రమం ఘన విజయం

రాత్రంతా మేల్కొని భద్రత నిర్వహించిన పోలీసులు

అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసుల పహారా





**మే 7 ప్రజా జ్యోతి న్యూస్ మైలవరం** మైలవరం మండలం దొడియం గ్రామంలో జరుగుతున్న సయ్యద్ షాలేం పీర్ ఖాద్రి వారి ఉరుసు మహోత్సవాల్లో భాగంగా 7వ తేదీ గంధం కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించబడింది. గ్రామంలో ఆధ్యాత్మిక వాతా వరణం నెలకొనగా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఉరుసు సందర్భంగా ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించారు. అర్బన్ సీఐ భాస్కర్ రెడ్డి, ఎస్సై శ్యాంసుందర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి తదితర పోలీసు సిబ్బంది రాత్రంతా మేల్కొని భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తుల మధ్య ఎలాంటి గొడవలు లేకుండా, శాంతియుత వాతావరణంలో గంధం కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో గ్రామస్థులు పోలీసు సిబ్బందిని అభినందించారు. విద్యుత్ దీపాలతో అలంకరించిన దర్గా ప్రాంగణం భక్తులను ఆకట్టుకోగా, పూలతో ప్రత్యేకంగా అలంకరించిన గంధం ఊరేగింపు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దొడియం గ్రామ ప్రజలకు అన్నదానం ఏర్పాటు చేయడం జరిగింది. శాంతియుతంగా పండుగ జరుపుకొని ఎటువంటి సమస్యలు జరగకుండా ఉండాలని పోలీస్ వారి హెచ్చరిక చేయడం జరిగింది.

## వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు చందమామ కథలు.



**పాలకొల్లు. ప్రజాజ్యోతి. కొట్టి రామం. మే 7.** జిన్నూరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా గురువారం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి, ఉపాధ్యాయులు తాళాబత్తుల వెంకటేశ్వరరావు విద్యార్థులకు చందమామ కథలు చెప్పారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చందమామ మాస పత్రికలో ఉండే చిన్న చిన్న కథలను నాటి విద్యార్థులు ఎంతో ఆసక్తిగా చదివేవారన్నారు. జిన్నూరు గ్రంథాలయం లో చందమామ, బాల మిత్ర పుస్తకాలు కొన్ని భద్రంగా ఉంచారని విద్యార్థులు వాటిని చదవుకోవచ్చునన్నారు. క్రాఫ్ట్ టీచర్ తాళాబత్తుల వీరభద్ర కుమారి వేస్ట్ వాటర్ బాటిల్స్ తో కొబ్బరి చెట్టు ఫ్లవర్స్ తయారు చేయడం విద్యార్థులకు నేర్పించారు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సహాయ కార్యదర్శి ఆచంట సాయిరాం జీకే కు సంబంధించిన జాతీయ అంతర్జాతీయ విషయాలు విద్యార్థులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు బూడి కృష్ణ గ్రంథపాలకురాలు జోగారత్నం విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇసుక దోపిడీ.అక్రమ రవాణాపై ఎమ్మార్వోకు ఫిర్యాదు చేసిన టి.డి.పినాయకులు శంకర్రావు.రంజిత్



**అనంతగిరి మండలం. మే 7. ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్ .** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం. కాశీపట్నం.చిలకలగేడ్డ గ్రామాల గోస్థాని నది జలాల నుండి సహజ సిద్ధంగా వస్తున్న ఇసుకను మైదాన ప్రాంత ఇసుక వ్యాపారులు ఇసుక దోపిడీ చేస్తూ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని. అనంతగిరి మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వి. శంకర్రావు ఎం. రంజిత్ గురువారం నాడు ఎమ్మార్వోకు ఫిర్యాదు చేశారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరగా విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎమ్మార్వో స్పష్టం చేశారు. అంతేకాకుండా చిలకలగేడ్డ ప్రాంతంలో సిబ్బందిని నియమించింది నిఘా ఏర్పాటు చేస్తామని అన్నారు.

## రైతులకు వ్యవసాయ పనిముట్లు ఏవో శివ శంకర్



**ఎమ్మిగనూరు మే 07(ప్రజా జ్యోతి ):** రైతులకు వ్యవసాయ పనిముట్లు సబ్సిడీ ప్రభుత్వం అందిస్తుంది రైతులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శివశంకర్ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ పనిముట్లు ఇవ్వడానికి ప్రభుత్వం నుండి అనుమతి వచ్చినది కావున పనిముట్లు కావలసిన రైతులు మీ రైతు సేవ కేంద్రంలో దరఖాస్తు అప్లై చేసుకోవలెను 5 వ తేదీ నుండి 19 వ తేదీ వరకు దరఖాస్తు సమర్పణ, 20 తేదీ నుండి 22 వ తేదీ వరకు రైతులు మార్పులు చేర్పులు ప్రక్రియ, 23 తేదీ నుండి 25వ తేదీ వరకు లాటరీ ప్రక్రియ ద్వారా దరఖాస్తుదారులను జిల్లా ఇన్చార్జి మంత్రి ఆమోదంతో లాటరీ ప్రక్రియ ద్వారా దరఖాస్తుదారులను ఎంపిక చేయబడును, ఎంపిక చేసిన రైతులను మే 26వ తేదీ నుండి జూన్ 6 వ తేదీ వరకు రైతులకు నాన్ సబ్సిడీ పోర్షన్ కట్టడానికి అవకాశం కల్పిస్తారు, 26-5-2026 వ తేదీ నుండి 26-6-2026 వరకు యంత్ర పరికరాలు రైతులకు డెలివరీ చేస్తారు, సన్న కారు, ఎస్సీ మరియు ఎస్టీ రైతులకు 50 శాతం సబ్సిడీ, జనరల్ కేటగిరి రైతులకు 40 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు ఇవ్వడానికి అనుమతులు వచ్చాయి.. వ్యవసాయ యంత్ర పరికరాలు ఏవనగా. ట్రాక్టర్ పరికరాలు, విత్తడం, నాటడం, మరియు త్రవ్వే యంత్రాలు, స్ప్రేయర్లు, ట్రాక్టర్లు మరియు మినీ ట్రాక్టర్లు ( 40 హ్పా లోపు), పవర్ టిల్లర్లు, హార్వెస్టింగ్ నూర్పిడి యంత్రాలు.. తదితర పరికరాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి అని తెలిపారు.

## జనగణన నమోదులోఎన్యుమరేటర్ షీట్ లో ఉన్న వాటికి మాత్రమే వివరాలను అందించండి

**తాహసిల్దార్ లక్ష్మీ లావణ్య**



**తాళ్లపూడి, మే 7, ప్రజాజ్యోతి న్యూస్** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తాళ్లపూడి మండలంలో చేపట్టిన జన గణన నమోదు కార్యక్రమంలో ప్రతి ఇంటింటా వివరాలు సేకరిస్తున్న నేపథ్యంలో ప్రజలుఅవసరమైన మేరకు వివరాలను అందిస్తే సరిపోతుందని తాళ్లపూడి తహసిల్దార్ లక్ష్మి లావణ్య అన్నారు. ప్రజలు తమ పూర్తి వివరాలను వివరించక్కర్లేదని ఉదాహరణకు (జన గణన అధికారులకు ఇవ్వకూడని వివరాలు ఒటిపి, ఆధార్, పాన్ నంబర్, బ్యాంక్ ఖాతా డెబిట్, క్రెడిట్ కార్డ్ వివరాలు అడిగితే అది ఖచ్చితంగా మోసపోయినట్లుగా గుర్తించి వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చునని ఆమె మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఎన్యూమరేటర్ షీట్ లో ఉన్న ప్రశ్నలకు మాత్రమే సమాధానాలు ఇవ్వాలన్నారు.

# కరీంనగర్‌లో టెన్షన్.. టెన్షన్...

**కరీంనగర్ :** తెలంగాణలో నేతల మాటలు శృతి మించుతున్నాయి. ఈ మాటల మంటలు కారణంగానే కరీంనగర్‌లో ఉద్రికత పరిస్థితులు నెలకొన్నాయి. బండి సంజయ్, కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి మధ్య మాటల తూటాలు, సవాళ్ల పర్వం సాగుతోంది. ఇది కాస్త దాడుల వరకు వెళ్లింది. బీఆర్ఎస్ నేతల మాటలకు ఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ శ్రేణులు దాడులకు దెగబడ్డారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై దాడి చేశారు. ప్రెస్ మీట్ జరుగుతుండగానే బీజేపీ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారు. కౌశిక్ రెడ్డి కారును ధ్వంసం చేశారు. రేవంత్, కేటీఆర్ కుమ్మక్కు అయ్యారని అందుకే కాళేశ్వరం సహా ఏ కేసులు కూడా ముందుకు కదలడం లేదని బండి సంజయ్ ఆరోపించారు. దీనిపై కేటీఆర్ కౌంటర్ ఇస్తూ ఎవరు ఎవరితో కుమ్మక్కు అయ్యారో తమకు తెలుసని అన్నారు. చాలా విషయాలు తమ వద్ద ఉన్నాయని సమయం వచ్చినప్పుడు అన్నింటినీ బయటపెడతామన్నారు. ఎవరికి ఎవరు సహాయ మంత్రిగా ఉన్నారో తేలుస్తామని అన్నారు. కచ్చితంగా ఒక్కో విషయం వెలుగులోకి వస్తుందని అన్నారు. దీనిపై బండి సంజయ్ ప్రెస్‌మీట్ పెట్టి కేటీఆర్‌పై తీవ్ర పదజాలంతో దూషించారు. మనిషి పుట్టక అంటూ అసభ్యంగా మాట్లాడారు. కరీంనగర్‌లో పూర్తిగా కేటీఆర్‌ను తిరగనివ్వబో మని అన్నారు. తనపై చేసిన ఆరోపణలు రుజువులు చూపించాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్ మత్తులో ఏదేదో మాట్లాడుతున్నారని దునుమాడారు. దీనికి బీఆర్ఎస్ కౌంటర్ ఇచ్చింది. డ్రగ్స్ వాడే అలవాటు బండి సంజయ్‌కు ఉందని అన్నారు. ఉన్నమాట అంటే ఉలుకు ఎందుకని ప్రశ్నించారు. తంబాకు, డ్రగ్స్ తినే అలవాటులో బండి సంజయ్ ఏదేదో మాట్లాడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ దాడిని తట్టుకోలేకపో యిన బీజేపీ శ్రేణులు ఆగ్రహంతో ఊగిపోయారు. ప్రెస్ మీట్ జరుగుతున్న టైంలోనే మాజీ మంత్రి గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై దాడికి తెగబడ్డారు. లోపల ప్రెస్ మీట్ జరుగుతున్న టైంలోనే విధ్వంసం సృష్టించారు. దాడులపై పాడి కౌశిక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై బీజేపీ, కాంగ్రెస్ కలిపి హత్యాయత్నం చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యేపైనే ఈ స్థాయిలో దాడులు చేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. తనను చంపేందుకు ఇప్పటికే రెక్కీ నిర్వహించారని ఇదే విషయాన్ని ఉదయం పెట్టిన ప్రెస్ మీట్‌లో చెప్పానని అన్నారు. అదే ఇప్పుడు కనిపించిందన్నారు. తనను చంపేందుకు కత్తులు, బాంబులు, రాడ్లతో వచ్చారని అన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ దారి తప్పిందని చెప్పడానికి వరుసగా జరుగుతున్న ఘటనలే ఉదాహరణ అని అన్నారు. దాడులు చేసిన వారిపై కఠినంగా



శిక్షించాలని పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలన్నారు. వారిని వెంటనే రిమాండ్‌కు తరలించాలని అన్నారు. తాను ఎవరినీ రెచ్చగొట్టలేదని అన్నారు. బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు తాము రియాక్ట్ అయ్యామని అన్నారు.

**పాడి కౌశిక్ రెడ్డి అరెస్ట్**

కరీంనగర్‌లో టెన్షన్ టెన్షన్. మాటలు హద్దు దాటి దాడుల వరకు వెళ్లాయి. పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని అరెస్టు చేసి తరలించారు. దీనిపై ఆయన మండిపడ్డారు. దాడులు చేసిన వారిని వదిలేసి తనను అదుపులోకి తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.అరెస్టుకు ముందు ప్రెస్‌మీట్ పెట్టిన కౌశిక్ రెడ్డి రేవంత్, బండి సంజయ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. కరీంనగర్‌లో తుపాకి సంస్కృతి పెరుగుతుందని ప్రశ్నించామని అందుకే బండి సంజయ్, రేవంత్ రెడ్డి కలిసి తన గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తాను ఎప్పుడూ ఎవరినీ రెచ్చగొట్టలేదన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే దానికి తమ పార్టీ నుంచి కౌంటర్ ఇచ్చామన్నారు. కేటీఆర్ డ్రగ్స్ తీసుకుంటున్నారని కామెంట్ చేయడంతోనే తాము కూడా బండి సంజయ్‌పై అనుమానం వ్యక్తం చేశామన్నారు. అలా తంబాకు, డ్రగ్స్ కలిపి తీసుకోవడం వల్లే తలపై జట్టు ఊడిపోయిందని అన్నట్టు చెప్పారు. వారు చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తే దాడులు చేస్తారా అని కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని అన్నారు. అందుకే ఎమ్మెల్యేగా తనపై హత్యా యత్నం జరిగిందని ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఉన్న తనకే రాష్ట్రంలో రక్షణ లేకుంటే సామాన్యుడి పరిస్థితి ఏంటని నిలదీశారు. ఇలాంటి వారికి అధికారం కట్టబెడితే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతుందన్నారు. వాళ్లా కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావును తిట్టొచ్చు కానీ తాము మాత్రం కౌంటర్ ఇవ్వకూడదా అని ప్రశ్నించారు. తనపై జరిగిన దాడిలో ప్రభుత్వ హస్తం కూడా ఉందన్నారు కౌశిక్ రెడ్డి. ఉదయం పెట్టిన ప్రెస్‌మీట్‌లో తనపై హత్యాయత్నం జరుగుతుందని చెప్పానని అన్నారు. దీని కోసం రెక్కీ నిర్వహిస్తున్నారని కూడా వెల్లడించారని వివరించారు. చెప్పినట్టుగానే తనపై రాడ్లు, కత్తులు, బాంబులతో వచ్చి దాడికి తెగబడ్డారని ఆరోపించారు. తన కార్యకర్తలకు గాయాలు అయ్యాయని, తన కారు ధ్వంసమైందని చెప్పారు. పోలీసులకు కూడా గాయాలు అయినట్టు వెల్లడించారు. దాడికి పాల్పడిన వారిపై అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలన్నారు. అయితే ఇక్కడ దాడి చేసిన వారిని వదిలేసి తనను అరెస్టు చేయడంపై మండిపడ్డారు.

# నేను ఆ రోజు బ్రోతల్ కీపర్‌గా వెళ్లా..

**రెండు గంటలు చాలా టెన్షన్ పడ్డా..': మల్కాజిగిరి సీపీ సుమతి**

**హైదరాబాద్ :** మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి చేపట్టిన సాహసోపేతమైన స్టింగ్ ఆపరేషన్లు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల అర్ధరాత్రి వేళ సాధారణ మహిళగా రోడ్డుపై నిలబడి వేధింపులకు పాల్పడుతున్న 40 మంది పోకిరీలను పట్టుకున్నారు. గతంలోనూ తన ప్రాణాలకు తెగించి హ్యూమన్ ట్రాఫికింగ్ ముఠాలను ఎలా మట్టుబెట్టారో ఆమె ఓ యూట్యూబ్ ఛానెల్‌తో పంచుకున్నారు. పోలీసు డ్రెస్సులో మాత్రమే కాకుండా.. సాధారణ పౌరురాలిగా మారి నేరస్తుల గుండెల్లో వణుకు పుట్టిస్తున్న ఈ ఐపీఎస్ అధికారిణి ప్రస్థానం నేటి యువతకు నిజంగా స్ఫూర్తిదాయకం.సీనియర్ ఐపీఎస్, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాఫిక్‌గా మారారు. దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు ఓ సాధారణ మహిళగా ఆమె స్రీకెట్ ఆపేరషన్ చేపట్టారు. ఆపరేషన్‌లో భాగంగా అర్ధరాత్రి రోడ్డుపై నిలబడిన ఆమెను దాదాపు 40 మంది పోకిరీలు వేధింపులకు పాల్పడ్డారు. జుగుప్సకరమైన మాటలతో ఇబ్బందులకు గురి చేశారు. వారందరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. అయితే సుమతి ఇలా ఫీల్డ్ ఆపరేషన్లు చేపట్టడం ఇదే తొలిసారు కాదు. ఆమె గంతంలోనూ ఇలాగే సీక్రెట్ ఆపేరషన్లు చేపట్టి అమ్మాయిల అక్రమ రవాణా, వేధింపులకు గురి చేస్తున్న వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకు న్నారు. 2004 సమయంలో హైదరాబాద్ కూకట్‌పల్లిలో అమ్మాయిలను వ్యభిచార రొంపిలోకి దింపుతున్న ఓ ముఠా ఆట కట్టించారు. ఆ రోజు ఏం జరిగింది..? ఎలా ఆ ముఠాను పట్టుకున్నారనే విషయాలను ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.అమ్మాయిలతో ట్రాఫికింగ్ చేస్తున్నారన్న సమాచారంతో అప్పట్లో ఓ స్టింగ్ ఆపరేషన్ చేపట్టాం. హైదరాబాద్ నగరంలో చాలా చోట్ల రైడ్ చేశాం. చివరగా.. కూకట్‌పల్లి, చందానగర్ ఏరియాలో మాకు ఓ ఇన్ఫర్మేషన్ దొరికింది. అమ్మాయిలను రొంపిలోకి దింపుతున్న




వాళ్లను పట్టుకునేందుకు నేను కూడా ఓ బ్రోతల్ కీపర్‌లాగా వెళ్లాలనుకున్నా. మేం చేసిన ఆపరేషన్‌లో అదొక భాగం. దీంతో నేను బిజినెస్ చేసేవాళ్ల దగ్గరకు వెళ్లా. వెళ్తూ వెళ్తూ వెపన్ పెట్టుకున్నా. అమ్మాయిలను సప్లయ్ చేసేవాళ్ల ఆటో ఎక్కి కూకట్‌పల్లి నుంచి బయల్దేరాం. అలా వెళ్తున్న క్రమంలో నన్ను ఫాలో అవుతున్న ఇద్దరు ఎస్సైల వెహికల్ మిస్ అయిపోయింది. చివరకు నన్ను ఓ బ్రోకర్ అమ్మాయిలను ట్రాఫికింగ్ చేసే చోటుకు తీసుకెళ్లారు.అక్కడ లావుగా ఉన్న ఉ ముగ్గురు లేడీస్ ఉన్నారు. వారితో మాట్లాడటానికి వచ్చిన మరికొందరు అమ్మాయిల సప్లయర్స్ కూడా ఉన్నారు. ఇది చాలా సినిమాటిక్‌గా ఉంది. నన్ను చూసి వాళ్లకు డౌట్ వచ్చింది. ఇంత యంగ్ ఉంది నిజంగానే బ్రోకరా..? అని సందేహించారు. కానీ నేను వాళ్లను చాలా తెలివిగా నమ్మించాను. నేను ఆర్గనైజర్‌గా అక్కడకు వెళ్లి.. నా దగ్గర 10 మంది అమ్మాయిలు ఉన్నారని చెప్పా. దాంతో వాళ్లలో ఒకడు మా లోకెషన్ దగ్గరకు తీసుకెళ్లమని బలవంతపెట్టాడు. ఇప్పుడు కాదు..15 రోజుల తర్వాత కాంటాక్ట్ అవుతా అని చెప్పా. అయినా వాళ్లు ఇప్పుడే కాంటాక్ట్ ఇవ్వాలని చెప్పటంతో వారికి అనుమానం రాకుండా వారితో పాటే ఆటోలో ఎక్కి బయల్దేరాం. అలా తిరిగి కూకట్‌పల్లి వరకు వచ్చాం. పోలీసులకు నాకు కాంటాక్ట్ లేదు. సైట్‌లోకి ఎవరూ రాలేదు. దాంతో రెండు నిమిషాల్లో ఫోన్ చేసుకొని వస్తానని సినిమాల్లో చూపించిన మాదిరిగా బురిడీ కొట్టించి మా వాళ్లను అక్కడకు పిలిపించా.అమ్మాయిలను సప్లయ్ చేసే ఆర్గనైజర్లు, ఆ ముఠా సభ్యులు దొరికిపోయారు. కానీ ఆ రెండు గంటలు చాలా టెన్షన్ పడ్డా. ఏ మాత్రం తేడా వచ్చినా.. నేను సేవ్ అవ్వలే ను.. డిపార్ట్‌మెంట్ ఇబ్బందుల్లో పడుతుంది. కానీ నా దగ్గర వెపన్ ఉండటమే నా ధైర్యం. అమ్మాయిలు ఏ సమయం లోనైనా ధైర్యంగా ఉండాలి. మనల్ని మనం కాపాడుకు నేందుకు ప్రయత్నించాలి. కాలేజీలో చదువుకునే సమయం లో నేను కూడా చాలా సార్లు వేధింపులకు గురయ్యా. కానీ ధైర్యంగా ముందుడుగా వేయాలి. తల్లిదండ్రులు కూడా అమ్మాయిల్లో ధైర్యాన్ని నూరిపోయాలి.' అని సీపీ సుమతి వెల్లడించారు.

# విద్యార్థులకు రేవంత్ సర్కార్ తీపి కబురు..

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం విద్యా రంగంలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. 2026-27 విద్యాసం వత్సరం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో కొత్త విధానాన్ని అమలు చేయనుంది. ముందుగా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకే నిధుల విడుదలలో ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, ఏ ఏడాది ఫీజులు ఆ ఏడాదే చెల్లించేలా ఎస్సీ సంక్షేమ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. మరోవైపు.. విద్యా వ్యవస్థలో సంస్కరణల నేపథ్యంలో ఇంటర్ అడ్మిషన్ల షెడ్యూల్‌ను బోర్డు తాత్కాలికంగా రద్దు చేసింది.తెలంగాణ రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ముఖ్యంగా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్న ఫీ రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు 2026-27 విద్యాసంవత్సరం నుండి కొత్త విధానాన్ని తీసుకురాబోతోంది. ఇందుకోసం సంక్షేమ శాఖల నోడల్ విభాగమైన ఎస్సీ సంక్షేమ శాఖ పలు కీలక ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఈ కొత్త విధానం ప్రకారం ఫస్ట్ కమ్ - ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అంటే ఎవరు ముందుగా దరఖాస్తు చేసుకుంటే వారికే నిధుల విడుదలలో తొలి ప్రాధాన్యత లభిస్తుంది.ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం ప్రకారం.. ఒక విద్యాసంవత్సరానికి సంబం ధించిన ఫీజులను మరుసటి ఏడాది చెల్లించే ఆనవాయితీ ఉంది. దీనివల్ల విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దీనిని అధిగమించేందుకు ఇకపై ఏ విద్యాసంవత్సరానికి సంబంధించిన ఫీజులను అదే ఏడాదిలో పూర్తి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఏటా సుమారు రూ.2,300 కోట్ల నుంచి రూ.2,400 కోట్ల వరకు ఉండే ఈ నిధులను ఒకేసారి విడుదల చేయాలా? లేక విడతల వారీగా ఇవ్వాలా? అనే అంశంపై స్పష్టమైన టైమ్ షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించనుంది. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల నేపథ్యంలో.. అడ్మిషన్లు ప్రారంభమయ్యేలోపే ప్రభుత్వం దీనిపై పూర్తి స్పష్టత ఇవ్వనుంది.ఇదిలా ఉండగా.. తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి విద్యార్థులకు షాక్ ఇస్తూ అడ్మిషన్ల షెడ్యూల్‌ను తాత్కాలికంగా రద్దు చేసింది. మే 4న విడుదల చేసిన అడ్మిషన్ల సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకుంటున్నట్లు బోర్డు కార్యదర్శి ప్రకటించారు.

## బూరగాపు వారి వివాహ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్.




**ప్రజాజ్యోతి రిపోర్టర్ :- యం. నరేష్.**పాతపట్నం మండలం కొరసవాడ గ్రామానికి చెందిన బూరగాపు మహేశ్వరరావు ఢ జయమ్మ దంపతుల కుమారుడు నవీన్ ఢ మాధవి దంపతుల వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఆయనతో పాటు మండల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పైల వారి వివాహ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్.



**ప్రజ్యోతి రిపోర్టర్ :- యం. నరేష్.** లపాతపట్నం మండలం తీమర గ్రామానికి చెందిన పైల పోలీసు ఢ సావిత్రమ్మ దంపతుల కుమారుడు రమణమూర్తి ఢ యామిని దంపతుల వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన శాసనసభ్యులు మామిడి గోవిందరావు . ఆయనతోపాటు మండల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇంకొల్లులో మహిళా రక్షణపై విస్తృత అవగాహన కార్యక్రమం




**బాపట్ల మే 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** మహిళలు, బాలికల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఇంకొల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ ఆదేశాలు, చీరాల డీఎస్పీ ఎం.డి. మొయిన్ మార్గదర్శకత్వంలో చీరాల శక్తి బృందం ఆధ్వర్యంలో రోటరీ క్లబ్‌లో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఇంకొల్లు సీఐ, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, ఐసీడీఎస్ ప్రతినిధులు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొని మహిళల భద్రత, సామాజిక చైతన్యంపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా శక్తి యాప్ వినియోగంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు వెంటనే పోలీసు సహాయం అందించే విధంగా ఈ యాప్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రతి మహిళ తమ మొబైల్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.అదేవిధంగా 112 అత్యవసర పోలీసు సేవలు, మహిళల సహాయ కేంద్ర నెంబర్లు 181, 1091, పిల్లల రక్షణ కోసం 1098 హెల్ప్‌లైన్ సేవల గురించి వివరించారు. సైబర్ మోసాల బారిన పడినప్పుడు 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని, మాదకద్రవ్యాల సమాచారం కోసం 1972 టోల్ ఫ్రీ సేవలను వినియోగించాలని తెలిపారు.పోక్సో చట్టం, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై మహిళలకు అవగాహన కల్పించారు. అలాగే శిరోరక్ష, ప్రాణరక్ష కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ ధరించడం ప్రాణరక్షణకు ఎంత ముఖ్యమో వివరించారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని సూచించారు.మహిళలు, విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని, ప్రజల్లో చైతన్యం పెరిగితేనే సమాజంలో నేరాలు తగ్గుతాయని అధికారులు తెలిపారు.

## తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి - ఎస్ఐ ధనుంజయుడు



**దువ్వూరు,మే 07 ( ప్రజా జ్యోతి )** దువ్వూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఆటో డ్రైవర్లకు గురువారం దువ్వూరు ఎస్ఐ ధనుంజయుడు కౌన్సిలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని,యూనిఫామ్ తప్పనిసరిగా ధరించి ఆటో నడపాలి.తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.ఇన్సూరెన్స్,ఫిట్ నెస్ సర్టిఫికేట్ కలిగి ఉండాలి.డ్రైవర్ సీటు ప్రక్కన అదనపు సీట్లు పెట్టుకొని ప్రయాణికులను ఎక్కించుకోరాదు.మోటార్ వాహనాల చట్టం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

## ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

అర్బన్ సీఐ రామకృష్ణ, ఎస్సై చిరంజీవి



**బద్వేల్ స్టాప్ రిపోర్టర్ మే 7 (ప్రజా జ్యోతి)** బద్వేల్ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఆటో డ్రైవర్లకు గురువారం నాడు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ చిరంజీవి లు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఆటోలను నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. తమ వెనక కుటుంబ సభ్యులు ఆధారపడి ఉన్నారని గుర్తుపెట్టుకుని ఆటోలు సురక్షితంగా నడుపుకోవాలన్నారు. ఆటోలో పరిమితికి మించి ప్యాసింజర్లను కానీ పరిమితికి మించి ఓవర్ లోడ్ వేయడం కానీ చేయరాదన్నారు మద్యం సేవించి గాని మొబైల్ మాట్లాడుతా గాని వాహనాలు నడప రాదన్నారు ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సీఐ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి జెకెసి ట్రస్ట్ చైర్మన్ ఆసరా




**చింతూరు మే 7 ప్రజాజ్యోతి** గ్రామానికి చెందిన శెట్టి రమేష్ ఇల్లు ఇటీవల ప్రమాదవశాత్తు కూలిపోయింది. కట్టు బట్టలతో బాధితులు రోడ్డున పడ్డారు. ఈ విషయాన్ని గ్రామ పెద్దలు జెకెసి ట్రస్ట్ చైర్మన్ తెలుగుదేశం మండల అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ దృష్టికి తీసుకువెళ్లారు. శెట్టి రమేష్ బాధిత కుటుంబానికి జమాల్ ఖాన్ ఇంటి నిర్మాణానికి కావలసిన సిమెంట్ రేకులు ఇనుప పైపులను బాధిత కుటుంబానికి గురువారం నాడు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు పసుపులేటి సల్మాన్ రాజు,శీలం తమ్మయ్య,ట్రస్ట్ సభ్యులు అబ్రారుల్హక్ ,సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

# స్కైరూట్ @ 1.1 బిలియన్ డాలర్లు

యునికార్న్‌గా అవతరించిన హైదరాబాదీ టెక్ కంపెనీ



న్యూఢిల్లీ, మే 7: హైదరాబాద్ ఆధారిత స్పేస్ టెక్నాలజీ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ యునికార్న్‌గా అవతరించింది. దేశంలోనే తమది తొలి స్పేస్-టెక్ యునికార్న్ అని గురువారం ఆ కంపెనీ వర్గాలు తెలిపాయి. ఇటీవల సమీకరించిన దాదాపు 60 మిలియన్ డాలర్లతో తమ సంస్థ విలువ 1.1 బిలియన్ డాలర్లకు చేరిందని పేర్కొన్నాయి.

కంపెనీ వాల్యూ బిలియన్ డాలర్లు దాటితే దానిని యూనికార్న్‌గా పరిగణిస్తారన్న విషయం తెలిసిందే. కాగా, షెర్పలో వెంచర్స్, సింగపూర్ సావరిన్ వెల్త్ ఫండ్ జీఐసీ, గ్రీన్‌కో గ్రూప్ వ్యవస్థాపకులు, అర్కమ్ వెంచర్స్ మరికొన్ని సంస్థల నుంచి ఫండింగ్ పొందినట్టు ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ వివరించింది. కాగా, అంతరిక్షంలోకి వెళ్లడం ఇప్పుడు మన ముందున్న ప్రధాన సవాళ్లలో ఒకటని, స్కైరూట్ ఆ సవాళ్లను అధిగమించేందుకు చక్కని మార్గాలను నిర్మిస్తున్నదని, భవిష్యత్తులో ఈ పరిశ్రమలో అద్భుత విజయాలు ఖాయమన్న ఆశాభావాన్ని ఈ సందర్భంగా షెర్పలో వెంచర్స్ వ్యవస్థాపకుడు రామ్ శ్రీరామ్ ఓ ప్రకటనలో వ్యక్తం చేశారు. ఇక విక్రమ్-1 ప్రయోగానికి సిద్ధమవుతున్న నేపథ్యంలోనే స్కైరూట్ తాజా ఫండింగ్‌కు దిగింది. విక్రమ్-1.. భారత్‌లో ఓ ప్రైవేట్ సంస్థ అభివృద్ధి చేసిన తొలి రాకెట్ కావడం విశేషం. గ్లోబల్ శాటిలైట్ కార్యకలాపాల కోసం అంతరిక్షంలోకి పంపడానికి దీన్ని రూపొందించారు. ఇదిలావుంటే విక్రమ్-1 ప్రయోగానికి ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నామని ఈ సందర్భంగా స్కైరూట్ సీఈవో, ఆ సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన పవన్ కుమార్ చందన ఓ ప్రకటనలో అన్నారు. అలాగే ఈ ప్రయోగాన్ని ఇటు భారత్‌కు, అటు ప్రపంచ అంతరిక్ష రంగానికి కీలక మైలురాయిగా అభివర్ణించారు. అంతేగాక మున్ముందు తమ కంపెనీలోకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ మదుపర్ల నుంచి పెద్ద ఎత్తున పెట్టుబడులు రాగలవన్న విశ్వాసాన్ని సైతం కనబర్చారు.

# పదేళ్లలో గ్లోబల్ సిటీగా హైదరాబాద్




అంతర్జాతీయ పెట్టుబడులను భారీగా ఆకర్షించేలా.. పదేళ్లలో హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మహా నగరాల అభివృద్ధిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా.. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తోందని వివరించారు. గురువారం ముంబైలో నిర్వహించిన 'నాస్కామ్ జీసీసీ సమ్మిట్ 2026'లో 'బియాండ్ పాలసీ: డిజైన్డ్ టు విన్ ది గ్లోబల్ జీసీసీ రేస్' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే సంకల్పంతో 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047'కు శ్రీకారం చుట్టామని వివరించారు. ప్రపంచంలోని అనేక నగరాలు అస్తవ్యస్త పట్టణీకరణ వల్ల 'అర్బన్ కొలాప్స్' కోరల్లో చిక్కుకున్నాయని, అలాంటి చారిత్రక తప్పిదాన్ని హైదరాబాద్ విషయంలో తాము చేయాలనుకోవడం లేదన్నారు. అందుకే.. భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, దాన్ని నిర్మించే బాధ్యతను తీసుకున్నామన్నారు. ఆ దిశగానే భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, మెట్రో విస్తరణ, కొత్త విమానాశ్రయాల అభివృద్ధి, ఆర్ఆర్ఆర్, మూసీ ప్రక్షాళన, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఐకం ఇన్నోవేషన్ హబ్ తదితర కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామన్నారు. కేవలం టెక్ కంపెనీలే కాకుండా.. బ్యాంకింగ్, లైఫ్ సైన్సెస్, సెమీ కండక్టర్లు, రక్షణ రంగం, ఎఫ్ఎంసీజీ, స్పేస్ టెక్, ఆతిథ్యం తదితర బహుళ రంగాలకు చెందిన దిగ్గజ సంస్థలు జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్ ను తమ మొదటి ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నాయన్నారు. గతేడాది 70కి పైగా జీసీసీలు ప్రారంభమయ్యాయని, దేశంలో ఇదే అత్యధికమని వివరించారు. ఈ ఏడాది కొత్తగా 100 జీసీసీలను ప్రారంభించి... వాటిల్లో కొత్తగా లక్ష మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జీసీసీలను కేవలం బ్యాక్ ఆఫీస్ ఆపరేషన్లకే పరిమితం చేయకుండా.. వాటిని 'గ్లోబల్ వాల్యూ సెంటర్లు'గా మార్చేలా ప్రత్యేక 'కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్'ను సిద్ధం చేస్తున్నామన్నారు.

పారిశ్రామికాభివృద్ధికి అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. హైదరాబాద్‌లో ఉన్న 'సిలికాన్ డెన్సిటీ (విభిన్న రంగాల నిపుణుల లభ్యత)'ని అందిపుచ్చుకుని 'మేడిన్ తెలంగాణ' బ్రాండ్ ను విశ్వవ్యాప్తం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో నాస్కాం ఛైర్మన్ శ్రీకాంత్, ప్రెసిడెంట్ రాజేష్ నంబియార్ తదితరులు పాల్గొన్నారు.

# లఖ్‌నవూ గెలిచింది







ప్లేఆఫ్స్ ఆశలు దాదాపుగా లేనట్లే.. అన్నీ గెలిచినా ముందుకెళ్తుందన్న గ్యారంటీ లేదు.. వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో పరాజయంపాలైంది. అలాంటి జట్టు ఐపీఎల్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఓడిస్తుందా? గెలుపు సహజంగా ఆర్సీబీదే అని అంతా అనుకున్నారు.. కానీ ఎవరూ ఊహించని విధంగా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ విజయాన్ని అందుకుంది. మిచెల్ మార్ష్ సెంచరీతో మెరిసిన వేళ విజయం సొంతం చేసుకున్న లఖ్‌నవూ సాంకేతికంగా ఇంకా ప్లేఆఫ్స్ రేసులో నిలిచింది. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు కాస్త ఉపశమనం. వరుస ఓటములతో తల్లడిల్లిన ఆ జట్టు ఎట్టకేలకు విజయాన్నందుకుంది. వర్షం కారణంగా 19 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో 9 పరుగుల తేడాతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఓడించింది. మిచెల్ మార్ష్ (111; 56 బంతుల్లో 9x4, 9x6) మెరుపు శతకం బాదడంతో మొదట లఖ్‌నవూ 3 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. పూరన్ (38; 23 బంతుల్లో 4x4, 1x6), పంత్ (32 నాటౌట్; 10 బంతుల్లో 4x4, 2x6) రాణించారు. డక్‌వర్త్ లూయిస్ విధానంలో లక్ష్యాన్ని 213 పరుగులకు సవరించగా ఛేదనలో ఆర్సీబీ తడబడింది. 6 వికెట్లకు 203 పరుగులే చేయగలిగింది. రజత్ పాటీదార్ (61; 31 బంతుల్లో 3x4, 6x6) టాప్ స్కోరర్. టిమ్ డేవిడ్ (40; 17 బంతుల్లో 4x4, 3x6) రాణించాడు. ప్రిన్స్ యాదవ్ (3/33), షాబాజ్ అహ్మద్ (2/33) ఆర్సీబీని దెబ్బతీశారు.

**బెంగళూరు తడబాటు:**

ఛేదనలో ఆరంభం ఆర్సీబీకి పెద్ద షాక్. 9 పరుగులకే ఓపెనర్లు బెతెల్ (4), కోహ్లి (0) నిష్క్రమించారు. బెతెల్‌ను షమి వెనక్కి పంపగా.. కోహ్లిని ప్రిన్స్ యాదవ్ బౌల్డ్ చేశాడు. ఆ దశలో కెప్టెన్ పాటీదార్, పడిక్కల్ నిలిచారు. పడిక్కల్ చక్కని షాట్లు ఆడాడు. నిలదొక్కుకోవడానికి సమయం తీసుకున్న పాటీదార్.. క్రమంగా చెలరేగిపోయాడు. ధనాధన్ షాట్లతో సిక్స్‌లు బాదేస్తూ జోరుగా పరుగుల వేట సాగించాడు. దిగ్వేశ్ రాఠి, మయాంక్ యాదవ్ ఓవర్లలో రెండేసి సిక్స్‌లు బాదాడు. పాటీదార్ 26 బంతుల్లోనే అర్ధశతకం సాధించాడు. 10 ఓవర్లలో 104/2తో ఆర్సీబీ బలమైన స్థితిలో నిలిచింది. అయితే ఆ జట్టు సాఫీగా లక్ష్యం దిశగా సాగుతున్న దశలో 8 పరుగుల వ్యవధిలో మూడు వికెట్లు పడగొట్టి లఖ్‌నవూ బలంగా పోటీలోకి వచ్చింది. పైచేయిలో నిలిచింది. ప్రిన్స్ ఒకే ఓవర్లో పడిక్కల్ (34), జితేశ్ శర్మలను ఔట్ చేసి ఆర్సీబీని గట్టి దెబ్బతీశాడు. జోరుమీదున్న పాటీదార్‌ను షాబాజ్ వెనక్కి పంపాడు. 112/5తో బెంగళూరు చిక్కుల్లో పడింది. ఆ తర్వాత ధనాధన్ ఇన్నింగ్స్ ఆడిన టిమ్ డేవిడ్‌ను 16వ ఓవర్లో షాబాజ్ ఔట్ చేశాడు. గెలవాలంటే ఆఖరి 3 ఓవర్లలో ఆర్సీబీ 47 పరుగులు చేయాల్సిన స్థితి. ఆ దశలో కృనాల్ విధ్వంసక బ్యాటింగ్‌తో లఖ్‌నవూను కలవర పెట్టాడు. కానీ ఆర్సీబీకి ఓటమి తప్పలేదు.

**దంచేసిన మార్ష్:**

లఖ్‌నవూ ఇన్నింగ్స్‌లో మార్ష్ ఆటే హైలైట్. చెలరేగి ఆడిన అతడు ఆ జట్టు బలమైన లక్ష్యాన్ని నిర్దేశించడంలో కీలక పాత్ర పోషించాడు. లఖ్‌నవూ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగగా.. మార్ష్ ధనాధన్ బ్యాటింగ్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మరో ఓపెనర్ అర్షిన్ కులకర్ణి (17; 24 బంతుల్లో 1x4) పరుగుల కోసం కష్టపడ్డా, షాట్లు ఆడేందుకు ఇబ్బందిపడ్డా.. మార్ష్ మాత్రం విధ్వంసక షాట్లతో విరుచుకుపడ్డాడు. హేజిల్‌వుడ్ ఓవర్లో స్ట్రెయిట్ సిక్స్‌తో మొదలైంది మార్ష్ జోరు. అదే ఓవర్లో అలాంటిదే బౌలర్ తలమీదుగా అతడు మరో సిక్స్ బాదేశాడు. భువనేశ్వర్, కృనాల్ పాండ్యలనూ మార్ష్ వదల్లేదు. విధ్వంసం కొనసాగిస్తూ రసిఖ్ సలామ్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లు, ఫోర్ కొట్టాడు. హేజిల్‌వుడ్ ఓవర్లో మూడు బంతులను బౌండరీ దాటించాడు. ఈ క్రమంలో మార్ష్ 20 బంతుల్లోనే అర్ధశతకం సాధించడం విశేషం. మరో వైపు అర్షిన్ సింగిల్స్ కూడా ఎక్కువగా తీయలేకపోయాడు. ఎదుర్కొన్న తొలి 22 బంతుల్లో అతడు 17 పరుగులు మాత్రమే చేశాడు. అయినా మార్ష్ మెరుపుల కారణంగా లఖ్‌నవూ 9 ఓవర్లలో 95/0తో బలమైన స్థితిలో నిలిచింది. ఆ దశలో వర్షం కారణంగా చాలా సమయం వృథా అయింది. తిరిగి ఆట మొదలయ్యాక అర్షిన్ ఔట్ కాగా.. మార్ష్ వీర బాదుడును కొనసాగించాడు. బలమైన షాట్లతో అలరించిన అతడు.. షెపర్డ్ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లతో సెంచరీ (49 బంతుల్లో) పూర్తి చేశాడు. మరోవైపు పూరన్ నిలిచాడు. అయితే లఖ్‌నవూ 14 ఓవర్లలో 145/1తో ఉండగా వర్షం తిరిగి మొదలైంది. మళ్లీ సమయం వృథా అయింది. ఓ ఓవర్‌ను తగ్గించారు. మార్ష్‌ను హేజిల్‌వుడ్ ఔట్ చేసినా.. పంత్ విరుచుకుపడడంతో ఆఖరి మూడు ఓవర్లలో లఖ్‌నవూ 44 పరుగులు రాబట్టింది. హేజిల్‌వుడ్ ఓవర్లో రెండు ఫోర్లు, సిక్స్ బాదిన పంత్.. ఆఖరి ఓవర్లో, సలామ్ బౌలింగ్‌లో వరుసగా 4, 4, 6తో మెరుపు ముగింపునిచ్చాడు. పూరన్ చివరి ఓవర్లో వెనుదిరిగాడు. అతడు మార్ష్‌తో రెండో వికెట్‌కు 70, పంత్‌తో మూడో వికెట్‌కు 29 పరుగులు జోడించాడు.

**లఖ్‌నవూ ఇన్నింగ్స్:**

మిచెల్ మార్ష్ (సి) బెతెల్ (బి) హేజిల్‌వుడ్ 111; అర్షిన్ కులకర్ణి (సి) పాటీదార్ (బి) కృనాల్ 17; పూరన్ (సి) కృనాల్ (బి) రసిఖ్ సలామ్ 38; పంత్ నాటౌట్ 32; మార్క్రమ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 10 మొత్తం: (19 ఓవర్లలో 3 వికెట్లకు) 209; వికెట్ల పతనం: 1-95, 2-165, 3-194; బౌలింగ్: భువనేశ్వర్ 4-0-34-0; హేజిల్‌వుడ్ 4-0-49-1; కృనాల్ 4-0-31-1; రసిఖ్ సలామ్ 4-0-53-1; సుయాశ్ శర్మ 2-0-21-0; షెపర్డ్ 1-0-16-0

**బెంగళూరు ఇన్నింగ్స్:**

బెతెల్ (సి) ప్రిన్స్ (బి) షమి 4; కోహ్లి (బి) ప్రిన్స్ 0; పడిక్కల్ (సి) అండ్ (బి) ప్రిన్స్ 34; పాటీదార్ (సి) మార్క్రమ్ (బి) షాబాజ్ 61; జితేశ్ (సి) పంత్ (బి) ప్రిన్స్ 1; డేవిడ్ (సి) దిగ్వేశ్ (బి) షాబాజ్ 40; కృనాల్ నాటౌట్ 28; షెపర్డ్ నాటౌట్ 23; ఎక్స్‌ట్రాలు 12, మొత్తం: (19 ఓవర్లలో 6 వికెట్లకు) 203; వికెట్ల పతనం: 1-9, 2-9, 3-104, 4-106, 5-112, 6-158; బౌలింగ్: షమి 4-0-33-1; ప్రిన్స్ యాదవ్ 4-0-33-3; మయాంక్ 4-0-50-0; దిగ్వేశ్ 4-0-50-0; షాబాజ్ 3-0-33-2

# బర్త్ డేకి గ్రాండ్‌గా...

అభిమాన హీరో పుట్టినరోజు దగ్గర పడుతోందంటే అభిమానులు ఆ హీరో తాజా చిత్రాల అప్‌డేట్స్‌ని ఆశిస్తారు. ప్రస్తుతం ఎన్టీఆర్ అభిమానులు అలానే అప్‌డేట్స్ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నెల 20న ఈ హీరో పుట్టినరోజు. ఈ సందర్భంగా ఫ్యాన్స్ ఆశించేవాటిలో ఎన్టీఆర్ హీరోగా త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమా ఒకటి. బర్త్ డేకి గ్రాండ్‌గా ఒక వీడియోను విడుదల చేయడానికి ఈ టీమ్ సన్నాహాలు చేస్తోందని సమాచారం. ఈ వీడియోలో విజుల్ ఎఫెక్ట్స్ భారీగా ఉంటాయని టాక్. కుమార స్వామి నేపథ్యంలో త్రివిక్రమ్ తెరకెక్కించనున్న ఈ మైథలాజికల్ మూవీకి 'గాడ్ ఆఫ్ వార్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు ఓ వార్త ప్రచారంలో ఉంది. మరి... ప్రచారంలో ఉన్నట్లు వీడియోను విడుదల చేస్తారా? ఆ రోజు టైటిల్‌ని కూడా ప్రకటిస్తారా? అనేది వేచి చూడాల్సిందే. ఇక ఈ సినిమా అంగీకరించాక కుమార స్వామి గురించి తెలుసుకోవడానికి ఎన్టీఆర్ పుస్తకాలు చదువుతున్నారట. ఇదిలా ఉంటే... ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్' చిత్రంలో నటిస్తున్నారు ఎన్టీఆర్. అలాగే 'దేవర' రెండో భాగం కూడా ఉంది.





# హృదయాన్ని కదిలిస్తుంది

హృదయాల్ని స్పృశించే అందమైన భావోద్వేగాలతో 'గోదారి గట్టుపైన' చిత్రాన్ని తెరకెక్కించామని, ఈ వేసవిలో అందరూ ఫ్యామిలీతో కలిసి చూడాల్సిన సినిమా ఇదని అన్నారు చిత్ర కథానాయకుడు సుమంత్ ప్రభాస్. సుభాష్‌చంద్ర దర్శకత్వంలో రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. బుధవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ పైవిధంగా స్పందించారు. మానవ విలువలు ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, ఈ సినిమా చూశాక తండ్రీకూతుళ్ల అనుబంధం తాలూకు గాఢత అర్థమవుతుందని, ప్రతీ అమ్మాయి వాళ్ల నాన్నకు ఫోన్‌చేసి 'ఐ లవ్ యూ డాడీ' అని చెబుతుందని సుమంత్ ప్రభాస్ అన్నారు. కూతురిని అమితంగా ప్రేమించే తండ్రి కథ ఇదని దర్శకుడు సుభాష్‌చంద్ర తెలిపారు. థియేటర్‌లో చూసి ఫీల్ కావాల్సిన సినిమా ఇదని నిర్మాత అభినవ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.



# మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్

త్రిగుణ్, పాయల్ రాధాకృష్ణ , అనీష్ కురువిల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'. మధుదీప్ చెలికాని దర్శకుడు. అరవింద్ మాండ్యం నిర్మాత. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఈనెల 15న విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్‌ని నిర్వహించారు. 'మనం నిజజీవితంలో చూసే పాత్రలు, సంఘటనలతో కూడిన ప్రేమకథ ఇది. ఈ ప్రేమకథలోని సంఘర్షణ అందరికీ కనెక్టయ్యేలా ఉంటుంది. అందరికీ గుర్తుండిపోయే సినిమా ఇది' అని దర్శకుడు మధుదీప్ నమ్మకం వ్యక్తంచేశారు. ఇంకా నిర్మాత అరవింద్, హీరోహీరోయిన్లు త్రిగుణ్, పాయల్ రాధాకృష్ణ, పంపిణీదారుడు ముత్యాల రాందాస్ కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: రవికుమార్.వి, సంగీతం: ప్రకాశ్ చెరుకూరి, అరుణ్ చిలువేరు, సమర్పణ: సీహెచ్‌వీఎస్ఎన్ బాబ్జీ, నిర్మాణం: లోటస్ క్రియేటివ్ వర్క్స్.

# వినోదాన్ని పంచే 'పురుషః'



పవన్‌కల్యాణ్ బత్తుల హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'పురుషః'. వీరు వులవల దర్శకత్వం వహిస్తున్నారు. బత్తుల కోటేశ్వర రావు నిర్మాత. ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకురాబోతున్నది. గురువారం రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ..విభిన్న కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందించామని, ఆద్యంతం వినోదంతో మెప్పిస్తుందని అన్నారు. ప్రచార చిత్రాలకు వచ్చిన స్పందన సినిమా విజయంపై నమ్మకాన్ని పెంచిందని నిర్మాత చెప్పారు. సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి శ్రవణ్ భరద్వాజ్ సంగీతాన్నందిస్తున్నారు.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,